జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాపాలన
NEWS IS RIGHT
Published from Hyderabad, Vishakhapatnam, Vijayawada*
https://prajapalana.com/epaper.php

**కావలెను**
స్నేహ గ్రూప్ విజయవాడ, గుంటూరు, వైజాగ్
హైదరాబాద్ నందు పనిచేయుటకు
మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను.
నెలకు రూ.15,000/- జీతం,
ట్రావెలింగ్ అలవెన్సు, ఇన్సెంటివ్ ఇవ్వబడును.
ఆసక్తి గలవారు మీ వివరాలని
ఈ క్రింది నెంబర్ కి వాట్సాప్ చేయగలరు.
7660027683, 91549 58315

సంపుటి 16 సంచిక 111 విశాఖపట్నం గురువారం 14 డిసెంబరు 2023 8 పేజీలు వెల : 5.00



# వైసీపీలో అలజడి...
## 65 మందిలో టెన్షన్...

విజయవాడ, డిసెంబర్ 13,: వైఎస్సార్ కాంగ్రెస్‌లో ఒక్కసారిగా అలజడి. ఒకేసారి 11 నియోజకవర్గాలకు ఇన్ చార్జులను మార్చేశారు. తిరుగులేని జనాదరణతో 151సీట్లతో 2019లో అధికారాన్ని చేజిక్కించుకున్న తమకు 2024లో ఎదురేముంది అనకుంటున్న నేతలకు ఒక్కసారిగా కుదుపు. ఉన్నట్టుండి ఇంత మందిని మార్చేస్తారా అని వాళ్లు అనుకుంటున్నారు. కానీ ఇది జస్ట్ శాంపిల్ మాత్రమే. అసలు సంగతి ముందుంది. విశ్వసనీయంగా అందిన సమాచారం మేరకు.. మొత్తం 65 స్థానాల్లో వైసీపీ అభ్యర్థులు మారబోతున్నారు. రెండు-మూడు జిల్లాలకే 11మందిని మార్చేస్తే.. మిగిలిన చోట్ల పరిస్థితి ఏంటన్న ఆందోళన ఇప్పుడు ఎమ్మెల్యేల్లో మొదలైంది. ఇచ్ఛాపురం మొదలుకుని కుప్పం వరకూ పార్టీ నేతల్లో టెన్షన్ మొదలైంది. ఎవర్ ఇన్.. ఎవరు అవుట్.. ఎవరికి ట్రాన్సఫర్ అన్న చర్చ పార్టీ వర్గాల్లో నడుస్తోంది. మార్చడమైతే ఖాయమన్న మెసేజ్ ఇప్పటికే ఎమ్మెల్యేలకు అంతర్గతంగా వెళ్లిపోయింది. అందుకే కొంతమంది సైలెంట్ గా ఉంటే.. మరి కొంత మంది పక్క చూపులు చూస్తున్నారు. పార్టీలోని ముఖ్యుల నుంచి అందిన సమాచారం మేరకు 65 స్థానాల్లో అభ్యర్థులు మారుతుతున్నారు. ఇందులో 40 మందిని పూర్తిగా పక్కన పెడుతుండగా.. మరో 25చోట్ల జంబ్లింగ్ చేయబోతున్నారు. వైస్సార్సీపీ అధినేత జగన్‌మోహనరెడ్డి కోసం ఐపాక్ టీమ్ పనిచేస్తున్న విషయం తెలిసిందే కదా.. ఈ సంస్థ గ్రౌండ్ లెవల్‌లో చేసిన సర్వేల్లో పార్టీ పరిస్థితి బాగాలేదన్న రిపోర్టు వచ్చింది. కనీసం 70స్థానాల్లో ఎమ్మెల్యేలపై తీవ్ర వ్యతిరేకత ఉందని తెలింది. ఐదు చోట్ల స్థానికంగా ఉన్న గొడవలను సర్దుబాటు చేసి మిగిలిన 65చోట్ల అభ్యర్థులను మార్చాలన్న నిర్ణయానికి జగన్ వచ్చేశారు. ఈ నిర్ణయం జరిగి కూడా నెలరోజులకు పైగానే అవుతోంది. కొంత మంది ఎమ్మెల్యేలకు ఈ మెసేజ్‌ను ఎప్పుడో చేరవేశారు కూడా.. విడతల వారీగా ఇప్పుడు.. అభ్యర్థులను మారుస్తూ వస్తున్నారు.

**శ్రీకాకుళం జిల్లాలో**

ధర్మాన బ్రదర్స్ కు మళ్లీ టికెట్లు దక్కే అవకాశం ఉంది. అయితే ధర్మాన మాత్రం తాను రాజకీయాల నుంచి విరమిస్తానని కుమారుడికి అవకాశం ఇమ్మని చెబుతున్నారు. టెక్కలి టికెట్ కోసం కిల్లి కృపారాణి మంతనాలు చేస్తున్నారు. స్పీకర్ తమ్మినేని సీతారాం విషయంలో వైసీపీ అధిష్టానం నిర్ణయం తీసుకోలేకపోతోంది. ఆయన నియోజకవర్గంలో వ్యతిరేకత ఉందని.. అలాగని మరో అభ్యర్థిని అక్కడ పెట్టే అవకాశం కూడాలేదని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

**విజయనగరం జిల్లాలో..**

బొత్స సత్యనారాయణను ఎంపీగా పంపించాలనే యోచన ఉంది. బొబ్బిలి, ఎస్‌కోటలో అభ్యర్థులను మార్చాలన్న డిమాండ్ ను పరిశీలిస్తున్నారు.

**విశాఖ జిల్లాలో**

విశాఖ జిల్లాలో చాలా మార్పులు జరగబోతున్నాయి. నియోజకవర్గ సమన్వయ కర్తగా తొలగించడంతో గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి కుమారుడు పార్టీకి రాజీనామా చేశారు. మళ్లీ అలాంటిదేమీ లేదన్నారు. అక్కడ వరికూటి రామచంద్రరావుకు బాధ్యతలు ఇచ్చారు. మంత్రి అమరనాథ్‌కు అప్పగించాలని చూసినా ఆయన ఆసక్తి చూపలేదు. అమరనాథ్‌ను పెందుర్తి నుంచి నిలబెట్టబోతున్నారు. అనకాపల్లి నుంచి ఎంపీ సత్యవతికి టికెట్ ఇచ్చే అవకాశం ఉంది. అరకు స్థానానికి కూడా అభ్యర్థిని మారుస్తున్నరు.

**ఉమ్మడి తూర్పు గోదావరిలో**

మంత్రి చెల్లుబోయినకు టికెట్ లేదన్న విషయాన్ని ఇప్పటికే కన్ఫామ్ చేశారు. ఆయనను ఎమ్మెల్యేగా ఎక్కడా నిలబెట్టే పరిస్థితి లేదు. రాజమండ్రి ఎంపీ స్థానం నుంచి పోటీ చేయాలని పార్టీ కోరుతోంది. రాజమండ్రి ఎంపీ భరత్‌ను రాజమండ్రి అర్బన్ అసెంబ్లీ నుంచి పోటీ చేయించాలన్న ఆలోచనలో ఉన్నారు. మాజీమంత్రి కన్నబాబును కూడా కాకినాడ ఎంపీ స్థానం నుంచి పోటీచేయాలని చెబుతున్నారు. అమలాపురం ఎంపీ అనురాధకు అమలాపురం అసెంబ్లీ స్థానం దక్కే అవకాశం ఉంది. కాకినాడ ఎంపీ వంగా గీతకు పిఠాపురం సీటు కేటాయించనున్నారు. కోనసీమ నుంచి మంత్రిగా ఉన్న విశ్వరూప్ ను పక్కన పెడుతున్నారు. ఆయన కుమారుడుకి విశాఖ జిల్లా పాయకరావుపేట సీట్ కేటాయించే అవకాశాన్ని చూస్తున్నారు.

**వెస్ట్ గోదావరిలో**

పశ్చిమ గోదావరిలో పార్టీ పరిస్థితి బాగా లేదన్న విషయాన్ని పార్టీ గుర్తించింది. నర్సాపురం పార్లమెంట్ స్థానంలోని అన్ని అసెంబ్లీ సీట్లలో ఇబ్బందికర పరిస్థితే ఉంది. ఇక్కడ చాలా మార్పులు జరిగే అవకాశం ఉంటుంది. లేదా ఎలాగూ గెలవరు అని తెలిస్తే.. పాత వాళ్లని కొనసాగించొచ్చు. మాజీమంత్రి ఆళ్ల నానికి కూడా ఏలూరులో ప్రత్యామ్నాయాన్ని చూస్తున్నారు.

**కృష్ణా జిల్లాలో**

కృష్ణా జిల్లాలో మల్లాది విష్ణు, వెల్లంపల్లి కి సీట్లు కష్టమే. జోగి రమేష్ కు కూడా ఎమ్మెల్యే సీటు లేదని చెప్పేసినట్లు సమాచారం.

(మిగతా 2లో..)

## భద్రతా వైఫల్యంపై విచారణ చేపడతాం: స్పీకర్ ఓం బిర్లా



న్యూఢిల్లీ : లోక్‌సభలో భద్రతా వైఫల్యంపై విచారణ జరుపుతామని స్పీకర్ ఓం బిర్లా ఎంపిలకు హామీ ఇచ్చారు. మధ్యాహ్నం 2 గంటలకు సభ తిరిగి ప్రారంభం కాగానే ఎంపిలు ఈ అంశాన్ని లేవనెత్తారు. భద్రతపై ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై చర్చించాలని పట్టుబట్టారు. బుధవారం పార్లమెంటులోకి ఇద్దరు ఆగంతకులు చొరబడిన ఘటనపై దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. ఈ ఘటనపై స్పీకర్ ఓం బిర్లా స్పందించారు. లోక్‌సభ లోపల ఇద్దరు ఆగంతకులు, బయట మరో ఇద్దర్ని అదుపులోకి తీసుకున్నామని అన్నారు. . వారి దగ్గరున్న వస్తువులను స్వాధీనం చేసుకున్నామని, ఈ ఘటనపై పూర్తి స్థాయిలో దర్యాప్తు చేపడుతామని చెప్పారు. నిందితులు వదిలింది కేవలం సాధారణ పొగే అని ప్రాథమిక దర్యాప్తులో తేలిందని, దాని గురించి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అన్నారు. అయితే, నిందితులు వదిలిన గ్యాస్ ఏమిటనే దానిపై సమగ్ర విచారణ జరుపుతామని చెప్పారు. దీనిపై ప్రతిపక్ష ఎంపిలందరితోనూ ఈ సాయంత్రం సమావేశం నిర్వహిస్తామని, సభ్యుల ఆందోళనలను పరిగణనలోకి తీసుకుంటామని అన్నారు. మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో లోక్‌సభలో ఇద్దరు ఆగంతకులు కలకలం సృష్టించారు. సందర్శకులు కూర్చునే గ్యాలరీ నుంచి ఓ వ్యక్తి సభలోకి దూకగా.. మరో వ్యక్తి గ్యాలరీ వద్ద ఒక రకమైన పొగను వదిలిపెట్టాడు. అదే సమయంలో పార్లమెంట్ భవనం వెలుపల మరో ఇద్దరు పసుపు రంగు పొగను వదిలారు. అప్రమత్తమైన భద్రతా సిబ్బంది ఈ నలుగుర్ని అరెస్టు చేశారు. లోక్‌సభలోకి చొరబడిన వారు సాగర్ శర్మ (20), మనోరంజన్ (35) కాగా, పార్లమెంటు ఎదుట ఆందోళన చేపట్టిన వారిని నీలమ్ (42), అమోల్ షిండే (25)లుగా గుర్తించినట్లు పోలీస్ కమిషనర్ సంజయ్ అరోరా తెలిపారు. మనోరంజన్ మైసూర్‌కి చెందిన వారని, కంప్యూటర్ సైన్స్‌లో గ్రాడ్యుయేషన్ పూర్తి చేశారని అన్నారు. మరొకరు హర్యానాలోని హిస్సార్‌కి చెందినవారని చెప్పారు. కర్ణాటక బిజెపి ఎంపి ప్రతాప్ సిన్హా జారీ చేసిన విజిటర్స్ పాస్‌తో సాగర్ శర్మ పార్లమెంటులోకి ప్రవేశించడం గమనార్హం.

## నేడు పలాస కిడ్నీ రీసెర్చ్ సెంటర్ ను ప్రారంభించనున్న జగన్



అమరావతి : ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి రేపు శ్రీకాకుళం జిల్లాలో పర్యటించనున్నారు. గురువారం రోజు పలాస పర్యటనలో పలు అభివృద్ధి కార్యక్రమాలను ఆయన ప్రారంభించనున్నారు. ఈ పర్యటనలో డాక్టర్ వైఎస్సార్ సుజలధార ఉద్దానం మంచినీటి ప్రాజెక్ట్‌ను, పలాస కిడ్నీ రీసెర్చ్ సెంటర్, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని ప్రారంభించనున్నారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేయనున్న భారీ బహిరంగ సభను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. ఇక, పలాస పర్యటన కోసం గురువారం ఉదయం తాడేపల్లిలోని తన నివాసం నుంచి బయలుదేరనున్న సీఎం జగన్ శ్రీకాకుళం జిల్లాకు చేరుకుంటారు.. ముందుగా కంచిలి మండలం మకరాంపురంలో డాక్టర్ వైఎస్సార్ సుజలధార ఉద్దానం మంచినీటి ప్రాజెక్టును ప్రారంభించనున్నారు. ఆ తర్వాత పలాస చేరుకుని కిడ్నీ రీసెర్చ్ సెంటర్, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని ప్రారంభించనున్నారు. అనంతరం రైల్వే క్రీడా మైదానంలో ఏర్పాటుచేసిన బహిరంగ సభలో పాల్గొని ప్రసంగిస్తారు.


## ఫుడ్ పాయిజన్... 20మంది విద్యార్థులకు తీవ్ర అస్వస్థత

కోనసీమ జిల్లా: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కోనసీమ జిల్లాలో ఫుడ్ పాయిజన్ కావడంతో 20మంది విద్యార్థులు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. కోనసీమ జిల్లాలోని ఓ బీసీ హాస్టల్ లో ఫుడ్ పాయిజన్ అయ్యింది. దీంతో 20మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. అమలాపురం రూరల్ మండలం సమనస బీసీ గురుకుల హాస్టల్లో ఫుడ్ పాయిజన్ అయింది. ఫుడ్ పాయిజన్ కావడంతో తీవ్ర కడుపునొప్పి, బ్లడ్ మోషన్స్‌తో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. అస్వస్థతకు గురైన విద్యార్థులను ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి సమాచారం తెలియాల్సి ఉంది.

## డిసెంబర్ 30న ఏటిపి పార్టీ ప్రజా అంకితసభను విజయవంతం చేయండి: కటికల రవికుమార్



విజయవాడ(ప్రజాపాలన ప్రతినిధి):అణగారిన వర్గాలకు రాజ్యాధికారం దక్కాలన్న లక్ష్యంతో ప్రారంభమైన ఆల్ తెలుగు ప్రజా పార్టీ(ఏ టి పి పార్టీ)ని ప్రజలకు అంకితం చేయడం కోసం మంగళగిరి లోని హ్యాపీ రిసార్ట్స్ లో సభను ఏర్పాటు చేస్తున్నామని ఏ టి పి పార్టీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కటికల రవికుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఏ.పి స్టేట్ కన్వీనర్ నమ్మి అప్పారావు యాదవ్, ఫైనాన్స్ ప్లానింగ్ సెక్రటరీ జి. ఉమా మహేశ్వర రావు,కందుల చందు తదితరులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిసెంబర్ 30 న జరిగే ప్రజా అంకితసభలో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పార్టీ నాయకులు,కార్యకర్తలు లీడర్స్ అందరు పెద్ద ఎత్తున పాల్గొని ఈ సభను విజయవంతము చేయవలసిందిగా కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సభ్యత్వ పెరుగుదల,ప్రజా సమీకరణకు సన్నద్ధం కావాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు .ఈ కార్యక్రమంలో పార్టీ జాతీయ, రాష్ట్ర నాయకులు పాల్గొంటున్నట్లు ఆయన తెలిపారు.




## వైఎస్సార్ ఆరోగ్యశ్రీలో రూ.25 లక్షల వరకూ ఉచిత చికిత్స: సీఎం జగన్



అమరావతి: వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కింద రూ. 25 లక్షల వరకూ ఉచిత చికిత్స అందించనున్నామని ఏపి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి వెల్లడించారు. ఆరోగ్య శ్రీపై తాడేపల్లి లోని తన క్యాంప్ కార్యాలయంలో ఆయన అధికారులతో బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఈ నెల 18న సీఎం ప్రారంభించనున్నారు. సమీక్షలో సీఎం జగన్ మాట్లాడుతూ ఆరోగ్యం, విద్య అన్నవి ప్రజలకు ఒక హక్కుగా లభించాలి. ఈ హక్కులను కాపాడటం ప్రభుత్వ బాధ్యత. అందుకనే అధికారంలోకి వచ్చిన రోజు నుంచే ప్రభుత్వం ఈ అంశాలపై విశేష కఅషి చేసింది. దీంట్లో భాగంగానే వైఎస్సార్ ఆరోగ్య శ్రీ కింద రూ. 25 లక్షల వరకూ ఉచిత చికిత్స కార్యక్రమాన్ని చేపట్టాం'' అని సీఎం పేర్కొన్నారు." వైఎస్సార్‌ఆరోగ్య శ్రీ కార్డు ఉందంటే.. ఆ వ్యక్తికి రూ. 25 లక్షలు వరకూ వైద్యం ఉచితంగా లభిస్తుంది. ఎవరికి ఆరోగ్య పరంగా ఎలాంటి సమస్యలు వచ్చినా సరే వైఎస్సార్ ఆరోగ్యశ్రీ అండగా నిలుస్తుంది'' అని సీఎం చెప్పారు." ఆరోగ్యశ్రీలో చికిత్స చేయించుకున్న వారికి మళ్లీ డాక్టర్ దగ్గరకు వెళ్లి చెకప్ చేయించుకునేందుకు(ఫాలో అప్ కన్సల్టేషన్) రవాణా ఛార్జీల కింద రూ.300 చెల్లించాలి. వైఎస్సార్‌ఆరోగ్య శ్రీ కింద ఉచితంగా వైద్యం పొందడం ఎలా? అన్నదానిపై రూపొందించిన వీడియోను అందరికీ పంపించాలి. ప్రభుత్వ ఆస్పత్రుల్లో పనిచేసే స్పెషలిస్టు డాక్టర్లకు అవసరమైన చోట క్వార్టర్లను నిర్మించాలి. 19 నుండి ప్రతి నియోజక వర్గంలో ఎమ్మెల్యేలు కూడా పాల్గనాలి. ప్రతి ఇంటికీ ఆరోగ్యశ్రీకార్డుల పంపిణీ జరుగుతుంది.

(మిగతా 2లో..)

# ప్రజాసంక్షేమం, రాష్ట్రాభివృద్ధి ముఖ్యమంత్రి జగన్‌తోనే సాధ్యం

**బహుజన పరిరక్షణ సమితి సారథి, సోషల్ డెమొక్రటిక్ ఫ్రంట్ రాష్ట్ర అధ్య క్షులు మాదిగాని గురునాధం**

**జగన్ కు మద్దతుగా 1172రోజులకు చేరిన బహుజన పరిరక్షణ సమితి ప్రజాఉద్యమ రిలే నిరాహారదీక్షలు**

**ఎండనక, వాననక కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలు.. రాష్ట్ర ప్రజల ప్రయోజనాల దృష్ట్యా ప్రజా ఉద్యమం**

**సంక్షేమ పాలనకు మరో రూపమే ముఖ్యమంత్రి జగన్ .. జగన్ కు 175 కి 175 సీట్లు రావడం ఖాయం**



చీరాల,డిసెంబర్ 13,ప్రజాపాలన : ప్రజా సంక్షేమం, రాష్ట్రాభివృద్ధి ముఖ్యమంత్రి జగన్‌తోనే సాధ్యమని, స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత, తండ్రి ని మించిన తనయునిలా, దివంగత సీ.ఎం.వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఆశయాలకనుగుణంగా, రాష్ట్రాన్ని ఇంత బాగా అభివృద్ధిచేసిన ముఖ్యమంత్రి కేవలం జగన్మోహన్ రెడ్డి మాత్రమేనని, బహుజన పరిరక్షణ సమితి సారథి,సోషల్ డెమొక్రటిక్ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షులు మాదిగాని గురునాధం అన్నారు. అంబేద్కర్ ఆశయాల సాధనే లక్ష్యంగా, చీరాల నుండి ఢిల్లీ స్థాయికి ఎదిగి, సోషల్ డెమొక్రటిక్ ఫ్రంట్ అధ్యక్షునిగా, పేద, బడుగు, బలహీన వర్గాల అభివృద్ధికై, విశేష కృషి చేస్తున్న సీనియర్ నేత మాదిగాని గురునాథం నాయకత్వంలో, బహుజన పరిరక్షణ సమితి ఆధ్వ ర్యంలో, చేపట్టిన రిలే నిరాహార దీక్షలు ఎండనక, వాననక, మిచౌంగ్ తుఫాను వర్షాల లోనూ కొనసాగుతూ, 1172వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా ప్రజా ఉ ద్యమ నేత మాదిగాని గురునాథం మాట్లాడుతూ, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా, సంక్షేమ పాలనయే ధ్యేయంగా, రాష్ట్రాన్ని అత్యద్భుతంగా ముఖ్యమంత్రి జగన్ అభివృద్ధి చేస్తుంటే, అభివృద్ధిని అడ్డుకుంటున్న ప్రతిపక్షాల వైఖరి దారుణమంటూ, తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. గత 75 ఏళ్లలో ఏ ముఖ్యమంత్రి చేయని రీతిలో, అతి చిన్న వయసులోనే, దేశంలోని మిగిలిన రాష్ట్రాలవారికి, ఆదర్శంగా నిలిచేలా, సంక్షేమపాలన అందజేస్తున్న ఏకైక ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అని ప్రశంసిస్తూ, జగన్ కి మద్దతుగా నిలిచారు.మూడు రాజధానుల ఏర్పాటుతో, చేపడుతున్న పాలనా వికేంద్రీకరణకు మద్దతుగా, ప్రజా ప్రయోజనాల దృష్ట్యా, గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం, తాళ్లాయ పాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్ లో, బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో, ఉద్యమానికి శ్రీకారం చుట్టడంలో, మాదిగాని గురునాథం కీలక పాత్ర పోషించారు. 54 వేల మంది పేదలకు ఇళ్ల పట్టాలు సాధించడంతో పాటు, స్కూళ్లలో ఆంగ్ల మాధ్యమం, మూడు రాజధానుల ఏర్పాటు కు ఉద్యమం ఊతమిచ్చింది.

ఈ క్రమంలో ప్రతిపక్షాలని ఏకి పారేస్తూ, ప్రతి పక్ష నేతల అవినీతి, అక్రమాలు, అరాచకాలను ఎండగడుతూ, కుల మతోన్మాదచర్యలను ఎండగడుతూ, ముఖ్యమంత్రి జగన్ హయాంలో, వైసిపి ప్రభుత్వం చేపడుతున్న ప్రజా సంక్షేమ పథకాలను, ప్రజల్లోకి తీసుకు వెళ్లేందుకు అంకితభావంతో, మాదిగాని గురునాథం కృషి చేస్తున్నారు. అంబేద్కర్ భావజాలంతో, ప్రముఖ స్వాతంత్ర సమరయోధులు, స్వర్గీయ మాదిగాని వెంకటేశ్వర్లు కుమారునిగా, రాజ్యాంగ పరిరక్షణ కై, రాష్ట్ర అభివృద్ధి కై, ప్రజా ప్రయోజనాల దృష్ట్యా, సీనియర్ నేత మాది గాని గురునాథం, బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో, చేపడుతున్న రిలే నిరాహార దీక్షలు, చర్చనీయాంశంగా మారాయి. మాదిగాని గురు నాథం చేపట్టిన ప్రజాఉద్యమం 1172వ రోజుకు చేరి, చరిత్రలో సువర్ణఅక్షరాలతో లిఖించేలా ఇంకా కొనసాగుతూనే ఉండటం విశేషం. చీరా ల నుండి తాళ్లాయపాలెం వెళ్లి, ప్రజా సంక్షేమానికై సీనియర్ నేత మాదిగాని గురునాథం, బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో,ప్రజా ఉద్య మం చేపట్టడం గమనార్హం.

– 2024 ఎన్నికలలో ముఖ్యమంత్రి జగన్ కు 175 కి 175 సీట్లు ఖాయం

సంక్షేమ పాలనకు మరో రూపంగా, ప్రజా సంక్షేమమే పరమావధిగా, గతంలో ఏ ముఖ్యమంత్రి అందించని రీతిలో, అత్యద్భుతంగా పరిపాలన చేస్తున్న, ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కి, 2024 ఎన్నికలలో 175కు 175 సీట్లు రావడం ఖాయమని, అదికూడా అత్యధిక మెజార్టీతో గెలు స్తారన్న ఆశాభావాన్ని మాదిగాని గురునాథం వ్యక్తం చేశారు.

## అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి: ఎమ్మెల్యే బలరామ్



చీరాల, డిసెంబర్ 13, ప్రజాపాలన : చీరాల నియోజకవర్గ వ్యాప్తంగా చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని, నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ పనులు పూర్తి చేయాలని, ఎమ్మెల్యే బలరామ్ అధికారులను ఆదేశించారు. చీరాల మునిసిపల్ కార్యాలయంలో, చీరాల నియో జకవర్గ పరిధిలో, పంచాయితీరాజ్, ఎడ్యుకేషన్ డిపార్ట్మెంట్ నాడు–నేడు కింద,విద్యుత్ ట్రాన్స్ఫార్మర్లు, స్తంభాల ఏర్పాటు, ఇతర పలు అభివృద్ధి పనులపై అధికారులతో ఎమ్మెల్యే బలరామ్ సమీక్షా సమావేశం నిర్వహించారు. అభివృద్ధి పనుల పురోగతిపై సమీక్షించి, పలు సూచనలు చేశా రు.కార్యక్రమంలో చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, వైస్ చైర్మన్ బొనిగల జైసన్ బాబు, పంచాయితీరాజ్ ఈ.ఈ.కృష్ణ, మునిసిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డి, డి.ఇ.ఏసయ్య, పంచాయితీరాజ్ డి.ఇ.శేషయ్య, చీరాల ఎంపీడీఓ నేతాజీ, విద్యుత్ డి.ఇ.ఇ.లు టి.శ్రీనివాసరావు, జే.శ్రీనివాసులు, ఏ.ఇ.లు శ్యామ్ సుందర్, కె.అరుణ, బ్రహ్మం, భాస్కర్, తదితర అధికారులు, వివిధ హోదాల్లో ఉన్న నాయకులు పాల్గొన్నారు.

## బెజవాడకు రేవంత్



విజయవాడ, డిసెంబర్ 13, :తెలంగాణలో ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన నాటి నుంచి సీఎం రేవంత్ రెడ్డి తీరిక లేకుండా గడుపుతున్నారు. వివిధ శాఖలపై రివ్యూలు నిర్వహిస్తూ కీలక మార్పులు సూచిస్తున్నారు. తాజాగారేవంత్ రెడ్డి వచ్చే వారం విజయవాడకు వెళ్లనున్నట్లు తెలుస్తోంది. అసెంబ్లీ ఎన్నికల ఫలితాలకు ముందు తిరుమల శ్రీవారిని రేవంత్ దర్శించుకున్న సంగతి తెలిసిందే. ఇప్పుడు సీఎం హోదాలో విజయవాడ కనకదుర్గ అమ్మవారిని దర్శించుకోనున్నారు. అదే సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్‌తో కూడా సీఎం రేవంత్ సమావేశం అవుతారని తెలుస్తోంది. విభజన చట్టంలోని కీలక అంశాలపై వారు చర్చించనున్నట్లు తెలిసింది. అయితే సీఎం ఏపీ పర్యటనపై అధికారిక ప్రకటన ఇంకా రాలేదు.తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడినప్పుడు హైదరాబాద్ పదేళ్ల పాటు ఉమ్మడి రాజధానిగా ఉంటుందని ప్రకటించిన సంగతి తెలిసిందే. అయితే, వచ్చే జూన్ నెలతో హైదరాబాద్ ఉమ్మడి రాజధానిగా కొనసాగే గడువు ముగియనుంది. అదే విధంగా నీటి వివాదాలు, పెండింగ్ లో ఉన్న విభజన అంశాలు ఉన్నాయి. ఒకవేళ ఇద్దరు ముఖ్యమంత్రుల భేటీ జరిగితే ఈ అంశాలు చర్చకు వచ్చే అవకాశం ఉంది. తాము ఏపీ ప్రభుత్వంతో మంచి సంబంధాలనే కోరుకుంటున్నట్లుగా ఇటీవల సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ క్రమంలోనే రేవంత్ రెడ్డి ఏపీ పర్యటనపై ఆసక్తి నెలకొంది.


## రాష్ట్ర అభివృద్ధి వైసీపీతోనే సాధ్యం: వైసిపి నేతలు



చీరాల, డిసెంబర్ 13, ప్రజాపాలన : రాష్ట్ర అభివృద్ధి వైసీపీతోనే సాధ్యమని, రాష్ట్రఅభివృద్ధి కోసం, ప్రజా సంక్షేమం కోసం, రాష్ట్రానికి జగన్ మళ్లీ ముఖ్యమంత్రి కావాలని, అలాగే చీరాల నియోజకవర్గ అభివృద్ధికి, ఎమ్మెల్యేగా కరణం వెంకటేష్ కావాలని, వైసీపీ చీరాల మండల పార్టీ అధ్యక్షులు ఆసాది అంకాళ రెడ్డి, అర్బన్ ఫైనాన్స్ డైరెక్టర్ గవిని శ్రీనివాసరావు, పి.ఎ.సి.ఎస్. అధ్యక్షులు బోయిన కేశవులు, జేసీఎస్ మండల ఇన్చార్జి బుర్ల సాంబశివరావు, తదితర వైసిపి నేతలు అన్నారు. చీరాల మండలం గవిని వారి పాలెం–2 సచివాలయం పరిధిలో, నిర్వహించిన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. కార్యక్రమంలో భాగంగా, వైసిపి నాయకులు ఇంటింటికీ తిరిగి, మరలా జగన న్ననే ఎందుకు కావాలో వివరించి, కరపత్రాలను పంపిణీ చేశారు. తొలుత పార్టీ జెండాను, సంక్షేమ పథకాల ఫ్లెక్సీని ఆవిష్కరించారు. కార్యక్రమంలో అర్బన్ ఫైనాన్స్ డైరెక్టర్ గవిని శ్రీనివాసరావు, వైసిపి చీరాల మండల పార్టీ అధ్యక్షులు ఆసాది అంకాళ రెడ్డి, పి.ఎ.సి.ఎస్.అధ్యక్షులు బోయిన కేశవులు, జిల్లా కార్యదర్శి బండారు శివపార్వతి, జేసీఎస్ మండల ఇన్చార్జి బుర్ల సాంబశివరావు, మాజీ వైస్ఎంపీపీ నాదెండ్ల కోటేశ్వ రరావు, బుర్ల మురళీ కృష్ణ, పృధ్వీ ధనుంజయ, గవిని నారాయణ, గుంటూరు వెంకట సుబ్బారావు, పర్వతనేని శ్రీనివాసరావు, షేక్ మస్తాన్, శీలం వెంకటేశ్వరమ్మ, గవిని కోటేశ్వరరావు, పిట్టు పోలయ్య, బుర్ల చిన్న వెంకటేశ్వర్లు, చప్పిడి రామచంద్రరావు, గవిని మేకల పోలయ్య, నక్కల వెంకన్న, ఆసాది దశరదరామిరెడ్డి, కుంచాల పోలురాజురెడ్డి, కీర్తి నాగరాజు, జంగిలి సాంబయ్య, గవిని రాయల్ నాగేశ్వరరావు, బుర్ల కృష్ణ, నర్రా బ్రహ్మయ్య, చావలి వాసు, గొర్ల శ్రీనివాసరావు, దొన్నెంపూడి కాంతయ్య, జోగి నాగయ్య, దొన్నెంపూడి జార్జి, మురుగు శ్యాంసన్, దొన్నేంపూడి ఆదామ్, గడ్డం పున్నయ్య, వాలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహసారధులు తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే బలరామ్, వైసిపి ఇన్చార్జి వెంకటేష్ లకు జీవితాంతం రుణపడి ఉంటాం: యాతం బ్రదర్స్

**వైసీపీ స్టేట్ యూత్ వింగ్ క మిటీ సెక్రటరీగా నియమితులైన యాతం.మేరిబాబు (యాతం.మధుకర్)**



చీరాల, డిసెంబర్ 13, ప్రజాపాలన : చీరాల ఎమ్మెల్యే కరణం బలరామ కృష్ణమూర్తి, వైసీపీ చీరాల నియోజకవర్గ ఇన్చార్జి కరణం వెంకటేష్ లకు, జీవితాంతం రుణపడి ఉంటామని, యాతం బ్రదర్స్ అయిన యాతం మేరిబాబు (యాతం. మధుకర్), యాతం సునీల్ లు స్పష్టం చేశారు. వైసిపి రాష్ట్ర యువజన విభాగ కమిటీ సెక్రటరీగా, తనను నియమించేందుకు సహకరించిన ఎమ్మెల్యే బలరామ్‌కు పుష్పగుచ్ఛం అందజేసి, పాదాభివందనం చేసి, ఎమ్మెల్యే బలరామ్ కు, వైసిపి ఇంచార్జి వెంకటేష్ కు, కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా యాతం మేరిబాబు మా ట్లాడుతూ, వైసిపి పార్టీ బలోపేతానికి, తనకిచ్చిన పదవికి మరింత గౌరవం పెరిగేలా, అంకితభావంతో కృషి చేస్తామన్నారు. తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా, బాధ్యతాయుతంగా పని చేయటమే కాకుండా, చీరాలలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జెండాను, గర్వంతో ఎగుర వేసేలా, కరణం వెంకటేష్ బాబుని ఎమ్మెల్యేగా అత్యధిక మెజార్టీతో గెలిపిస్తామని, సోదరుడు యాతం సునీల్ తో కలిసి శపథం చేశారు.

## భవాని శంకర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎమ్మెల్సీ మొండితోక అరుణ్ కుమార్



నందిగామ డిసెంబర్ 13 ప్రజాపాలన ప్రతినిధి పట్టణ శివారు పల్లగిరి గట్టుపై శివాలయంలో వేంచేసి ఉన్న శ్రీ భవాని శంకర స్వామికి కార్తీక మాస చివరి రోజు గౌరి పాడ్యమి సందర్భంగా నిర్వహించిన కుంకుమాభిషే కం, రుద్రాభిషేకం పూజా కార్యక్రమాలలో శాసనమండ లి సభ్యులు డాక్టర్ మొండితోక అరుణ్ కుమార్ పా ల్గొని స్వామి వారిని దర్శించుకొని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీ భవాని శంకర స్వామి ఆలయానికి రూ.1 లక్ష 16 వేల రూపాయల విరాళాన్ని ఎమ్మెల్సీ అందజేశారు అనంతరం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించి, భక్తులకు అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు. ముందుగా ఎమ్మెల్సీ ని శాలువాతో సత్కరించిన ఆలయ పండితులు వేద ఆశీర్వచనాలు అందజేశారు ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతిని ధు లు, వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్త లు, తదితరులు పాల్గొన్నారు

## మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో క్రీడా పోటీలను ప్రారంభించిన ఎమ్మెల్యే మొండితోక జగన్ మోహన్ రావు



నందిగామ డిసెంబర్ 13 ప్రజాపాలన ప్రతినిధి పట్ట ణంలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో 26 వ ఇంటర్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ ఫర్ గర్ల్స్ రీజినల్ లెవెల్ పోటీలను శాసనసభ్యులు డాక్టర్ మొండితోక జగన్ మోహన్ రావు బుధవారం ప్రారం భించారు.. తొలుత జెండా ఆవిష్కరణ, క్రీడాకారుల మార్చ్ ఫాస్ట్, క్రీడాకారుల పరిచయ కార్యక్రమాలను ని ర్వహించారుఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల మానసిక వికాసానికి క్రీడలు ఎంతగానో దో హదం చేస్తాయని తెలిపారు. ఆటలతో శారీరక దృఢ త్వం పెరుగుతుందని, పోటీతత్వం అలవడుతుందని చెప్పారు. గెలుపు సంబంధం లేకుండా కేవలం క్రీడా స్ఫూర్తితోనే మెలగాలని క్రీడాకారులకు సూచించారు. చదువుతోపాటు క్రీడలపై కూడా దృష్టి సారించాలన్నా రు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కళాశా ల అధ్యాపకులు, వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకు లు, తదితరులు పాల్గొన్నారు

## బాబు షూరిటీ - భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే శ్రీ రాంరాజగోపాల్ తాతయ్య



జగ్గయ్యపేట డిసెంబర్ 13 ప్రజాపాలన ప్రతినిధి పట్ట ణంలో 20,22 వ వార్డులో బ్రాహ్మణ వారి వీధిలో బా బు షూరిటి – భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నియోజకవర్గ ఇన్చార్జ్ శ్రీరామ్ రాజగో పాల్ తాతయ్య పాల్గొని ఇంటింటికి వెళ్లి భ విష్యత్తు కు గ్యారెంటీ కరపత్రాలను పంపిణీ చేసి జగన్ ప్రభు త్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్ర జలకు వివరించారుఈ కార్యక్రమంలో మేక వెంకటేశ్వ ర్లు, కర్రీ చిన్న,గొట్టే నాగరాజు, పేరం సైదేశ్వర రావు, మారెపల్లి శౌరి, కోటగిరి శేషగిరి రావు, షేక్ మధార్, గన్నవరపు పుల్లయ్య, మద్దుల ఉమా, ఎళ్లోజి ము త్యాల శేషగిరి రావు, బసవోజు శసి, గుగ్గిళ్ళ శివ తదితరులు పాల్గొన్నారు.

## మిచౌంగ్ తుపానుతో నష్టపోయిన పంట వివరాలు నమోదు చేయించండి



నూజివీడు, ప్రజాపాలన ప్రతినిధి: మిచౌంగ్ తుపాను తో ఏర్పడిన పంట నష్టాలతో కూడిన ప్రాథమిక నివేదికను ఉన్నతాధికారులకు అందించినట్లు వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు జి విద్యాసాగర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంట నష్టానికి సంబంధించి ప్రాథమికంగా రైతుల పంటల వారీగా, రైతు వారీగా, భూమి వివరాలతో వ్యవసాయ శాఖ అధికారికి లేదా రైతు భరోసా కేంద్రంలో తక్షణమే నమోదు చేయించాలని సూచించారు. దీని ద్వారా నష్ట నివారణ చర్యలు జరుగుతాయన్నారు.

జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాపాలన

**సంపాదకీయం**

**గురువారం 14, డిసెంబరు 2023**


# విద్యాలయాల్లో కుల వివక్ష వికృత రూపాలు

ఇంత పెద్ద సంఖ్యలో అట్టడుగు సామాజిక తరగతుల పిల్లలు చదువులు మానేయడం, ఆత్మహత్యల బారిన పడడం దేశ పాలకులను, కొందరు స్వయం ప్రకటిత మేధావులను ఏ మాత్రం చలింపచేయడంలేదు. ఎవరైనా ప్రశ్నిస్తే రెడీమేడ్ సమాధానాలు వుండనే వున్నాయి. 'చదువుల ఒత్తిడి, కుటుంబ సమస్యలు కారణాల'ని చిలక పలుకులు పలుకుతారు. భవిష్యత్‌పై ఎంతో ఆశతో కష్టపడి చేరుకున్న ఐఐటి, ఐఐఎం, కేంద్రీయ విశ్వవిద్యాలయాల నుండి సర్టిఫికెట్లు లేకుండానే వెనక్కు రావడం, నిర్జీవులుగా తిరిగి రావడం దేశానికి ఎంతో నష్టం. కేవలం తాము పుట్టిన కులం వల్లనే ఈ దుస్థితి రావడం నేడు భారతదేశ విద్యారంగం ఎదుర్కొంటున్న అతి ముఖ్యమైన ఆధునిక సామాజిక వివక్షకు నిదర్శనం.గత ఐదేళ్ళలో దేశంలోని వివిధ ప్రతిష్టాత్మకమైన విశ్వవిద్యాలయాల్లో దళిత, గిరిజన, బలహీన వర్గాలకు చెందిన 13,600 మంది విద్యార్థులు అర్థాంతరంగా చదువులు మానేశారని కేంద్ర విద్యాశాఖ సహాయ మంత్రి లిఖిత పూర్వకంగా పార్లమెంట్‌కు తెలిపారు. 2019–2021 మధ్య 35,000 మంది ఎస్.సి, ఎస్.టి విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారని మరో కేంద్ర మంత్రి ప్రకటించారు. ఇంత పెద్ద సంఖ్యలో అట్టడుగు సామాజిక తరగతుల పిల్లలు చదువులు మానేయడం, ఆత్మహత్యల బారిన పడడం దేశ పాలకులను, కొందరు స్వయం ప్రకటిత మేధావులను ఏ మాత్రం చలింపచేయడంలేదు. కేంద్ర ప్రభుత్వ బిజెపి నాయకులు రానున్న 2024 ఎన్నికల్లో విజయం కోసం వేయాల్సిన ఎత్తులు, ప్రజల ఐక్యతను విచ్ఛిన్నం చేసేందుకు అనుసరించాల్సిన జిత్తుల వ్యూహాల్లో మునిగిపోతున్నారు. మోడీ సంకీర్తనలో తీరికలేని కొందరు మేధావులు, అనుంగ మీడియా ఆయన 'ధీరోదాత్త' విజయాలను చరిత్రీకరించడం, కీర్తించడంతోనే సరిపోతున్నది. ఎవరైనా ప్రశ్నిస్తే రెడీమేడ్ సమాధానాలు వుండనే వున్నాయి. 'చదువుల ఒత్తిడి, కుటుంబ సమస్యలు కారణాల'ని చిలక పలుకులు పలుకుతారు. భవిష్యత్‌పై ఎంతో ఆశతో కష్టపడి చేరుకున్న ఐఐటి, ఐఐఎం, కేంద్రీయ విశ్వవిద్యాలయాల నుండి సర్టిఫికెట్లు లేకుండానే వెనక్కు రావడం, నిర్జీవులుగా మారడం దేశానికి ఎంతో నష్టం. కేవలం తాము పుట్టిన కులం వల్లనే ఈ దుస్థితి రావడం నేడు భారతదేశ విద్యారంగం ఎదుర్కొంటున్న అతి ముఖ్యమైన ఆధునిక సామాజిక వివక్షకు నిదర్శనం.కేవలం విద్యాలయాల్లోనే కాదు. ఉద్యోగాలు, నివాసాలు, వ్యాపారాలు అక్కడ ఇక్కడేమిటి? అన్ని చోట్లా సాంఘిక వివక్ష కొత్తరూపాల్లో అనేక వెర్రితలలు వేస్తున్నది. లక్షలాది మందికి విజ్ఞానాన్ని, వేలాది మందికి జీవించే హక్కును హరించి వేస్తున్నది. ప్రపంచీకరణ, అది సృష్టించిన వ్యాపార సంస్కృతి, విదేశీ ఉద్యోగాలు, ఇంగ్లీషు విద్య లాంటివి దేశంలోని సామాజిక సమస్యలన్నిటికీ పరిష్కారమని భావించే కొందరు బుద్ధిజీవుల ఆలోచన ఎంత అల్పమైందో ఈ సంఘటనలు రుజువు చేస్తున్నాయి. కుల దురహంకార హత్యలనేవి భూస్వామ్య అవశేషాల జబ్బు మాత్రమే కాదు. పెట్టుబడిదారీ వ్యవస్థ సృష్టించే డబ్బులో కూడా ఈ జబ్బు ఉంటుందని, అది ప్రాంతాలకు పరిమితమైంది కాదని దాని మూలాలు మన వెయ్యి పడగల కుల విష నాగులో ఉన్నాయని పదేపదే నిర్ధారణ అవుతున్నది.చదువులు మధ్యలోనే మానేయడం ప్రాథమిక, ఉన్నత పాఠశాల, జూనియర్ కాలేజీల్లోనే కాదు. ప్రతిష్టాత్మక ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటి), ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం), కేంద్రీయ విశ్వవిద్యాలయాల్లో కూడా కొనసాగడం ఆశ్చర్యం కలిగిస్తుంది. పార్లమెంట్‌లో బిఎస్‌పికి చెందిన రితేష్ పాండే అడిగిన ప్రశ్నకు విద్యాశాఖ సహాయ మంత్రి సమాధానం చెబుతూ ఎస్.సి. ఎస్.టి, ఒబిసి లకు చెందిన 13,626 మంది విద్యార్థులు గత ఐదేళ్ళలో చదువులు అర్థంతరంగా మానేశారన్నారు. వీరిలో ఒబిసీలు 6,825, ఎస్‌సిలు 3,680, ఎస్‌టిలు 3,121 మంది ఉన్నారు. 2019లో 10,335 మంది, 2020లో 12,526 మంది, 2021లో 13,089 మంది విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారని కేంద్ర సామాజిక న్యాయం, సాధికారిత శాఖా మంత్రి పార్లమెంట్‌కు చెప్పారు. ఇందులో అత్యధికం ఒబిసి, ఎస్‌సి, ఎస్‌టి విద్యార్థులు. హిందూ బంధువులారా ఐక్యం కండి అని మన దేశ విశ్వగురువు మొదలుకొని దేశ పాలకులు, (అ)ధర్మ పరిరక్షకులు ఘోషిస్తున్న కాలంలోనే అట్టడుగు కులాలకు చెందిన వేలమంది చదువులకు, జీవితాలకు దూరమయ్యారు.విజ్ఞానం పెరిగే కొద్దీ అజ్ఞానం, అసమానత దూరం కావాలి. కాని భారతదేశంలో పాలక పార్టీలు ఎన్నికల ప్రయోజనాల కోసం ఒకవైపు సంపన్న ఉన్నత వర్గాలను చేరదీసి పాత కాలం నాటి అనాగరిక, సాంఘిక వివక్ష రూపాలను కొనసాగిస్తున్నాయి. మరోవైపు అట్టడుగు వర్గాల ఓట్ల కోసం అనివార్యంగా కొన్ని రాయితీలను అమలు చేస్తున్నారు. ఈ ప్రక్రియలో అంతిమ విజేతలు ఉన్నత వర్గాల వారే. అందుకే రాజ్యాంగంలోని 17వ ఆర్టికల్‌లో 74 ఏళ్ళ క్రితం నిషేధించబడిన కుల వివక్ష నేటికీ కొనసాగుతూ మరింత ఉధృతమౌతున్నది. తరతరాలుగా ఆర్థికంగా, సామాజికంగా అణచివేతకు గురైన కులాలు, జాతులకు కొన్ని ప్రత్యేక సదుపాయాలు కల్పించకుండా సమాజ పురోగమనం సాధ్యం కాదని జాతీయోద్యమం గుర్తించింది. అందుకు అనుగుణంగా కొన్ని విధానాలను రూపొందించింది. అనేకమంది సంఘ సంస్కర్తలు తమ జీవితాన్నే ధారపోసి అభ్యుదయ, ప్రజాతంత్ర భావాల విస్తరణకు కృషి చేశారు. కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భావం నుండి కులవివక్ష, ఆర్థిక దోపిడీలకు వ్యతిరేకంగా క్రియాశీలమైన ప్రజా ఉద్యమాలను నిర్మించింది. వీటన్నిటి ఫలితంగా మన రాజ్యాంగంలో రిజర్వేషన్ సదుపాయం కల్పించబడింది. దీన్ని సహించ లేని శక్తులు నాడు కొన్ని ఉన్నాయి. నేడు ఆ శక్తుల ప్రతినిధులు దేశ అధికారాన్ని హస్తగతం చేసుకున్నారు.

**సామాజిక దృక్పథంతో మీరు రాసే రచనలు**
editor. prajapalana@gmail.com
**మెయిల్ కు పంపించినచో ప్రజా పాలన దినపత్రికలో ప్రచురించబడును**

# ఏపీపై తెలంగాణ ఎన్నికల ప్రభావం

తెలంగాణలో ప్రభుత్వ మార్పు సంకేతం ఏపీలో 2024లో జరిగి అసెంబ్లీ ఎన్నికలకు ఒక సూచన అని టీడీపీ శ్రేణులు భావిస్తున్నాయి. ప్రభుత్వ పథకాలతో ఆంధ్ర ప్రజలు తమను ఆదరిస్తారనే దీమాతో అధికార వైఎస్ఆర్‌సీపీ ఉంది. ఆంధ్రాలో కూడా కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం వస్తుందని కాంగ్రెస్ శ్రేణులు ఆశాజనకంగా ఉన్నారు. క్షేత్రస్థాయి పరిస్థితులను పరిశీలిస్తే ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ పార్టీ ఆశిస్తున్నట్టు పూర్వ వైభవం వచ్చే అవకాశమే లేదు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ బలం, బలగం అంతా ఏనాడో వైఎస్సార్సీపీలో కలిసిపోయింది. వేర్లు తెగిన చెట్టు చిగురించే అవకాశమే లేదు! 2024 లో జరిగే ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీ, కమ్యూనిస్టు పార్టీలు నోటాతో పోటీపడటం ఖాయం. ఇందులో ఎటువంటి సందేహం లేదు. 2024లో జరిగే ఏపీ ఎన్నికల్లో అధికార వైఎస్సార్సీపీ, టీడీపీ–జనసేన కూటమి మధ్య హోరాహోరీ పోటీ జరగనున్నది. 2019లో వైఎస్సార్సీపీకి, టీడీపీకి మధ్య ఓట్ల వ్యత్యాసం సుమారు 10 శాతం ఉంది. ఇంత వ్యత్యాసాన్ని దాటడం ప్రతిపక్షాలకు అసాధ్యమని ఇన్నాళ్లు విశ్లేషకులు, వైఎస్ఆర్‌సీపీ నేతలు భావించారు. తెలంగాణ విషయంలోనూ ఇలాగే అంచనా వేశారు. తెలంగాణలో 2018 ఎన్నికలతో పోలిస్తే కాంగ్రెస్ 18.5 శాతం ఓట్ల వ్యత్యాసాన్ని పూడ్చుకోవడమే కాకుండా, మరో రెండు శాతం అధిక ఓట్లు సాధించి ఏకంగా అధికారాన్నే కైవసం చేసుకోవడం ఇక్కడ గమనించాల్సిన ముఖ్యాంశం. ఈ కోణంలో చూస్తే ఆంధ్రప్రదేశ్‌లో 10 శాతం ఓట్ల వ్యత్యాసం రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్సీపీని కాపాడకపోవచ్చు. అంతేకాక ఈసారి టీడీపీ–జనసేనతో పొత్తుపెట్టుకోవడంతో ఆ పార్టీకి ఉన్న 5.53 శాతం ఓట్లు తెలుగుదేశానికి లభించే అవకాశాలున్నాయి. 2014 లో టీడీపీ–జనసేన– బీజేపీ కూటమిగా ఏర్పడి వైఎస్ఆర్‌సీపీపై సాధించిన విజయాన్ని ఇక్కడ గమనంలోకి తీసుకోవాలి. ఆంధ్రప్రదేశ్‌లో 'సింహం సింగిల్‌గా వస్తుంది', 'వై నాట్ 175' అంటూ వైఎస్సార్సీపీ నాయకులు మితిమీరిన విశ్వాసాన్ని ప్రదర్శిస్తున్నారు. ఇలాంటి పోకడలనే ప్రదర్శించిన బీఆర్ఎస్‌కి తెలంగాణ ప్రజలు బుద్ధి చెప్పారు. 2019 ఎన్నికల్లో వైఎస్ఆర్‌సీపీ విజయం కోసం క్షేత్రస్థాయిలో అనేక ప్రజాసంఘాలు, మేధావులు మద్దతునిచ్చారు. దాని ఫలితమే వైఎస్ఆర్‌సీపీ 151 సీట్లు సాధించడం. ఈ విషయాన్ని గ్రహించకుండా అహంకారంతో అందరినీ దూరం చేసుకుంటే తెలంగాణలో బీఆర్ఎస్ నష్టపోయినట్టే ఏపీలో వైఎస్ఆర్‌సీపీ కూడా నష్టపోవాల్సి వస్తుంది. టీడీపీ–జనసేన అందరినీ కలుపుకుపోతేనే అధికారానికి చేరువవుతుంది. చిన్నా చితక పార్టీలంటూ లెక్కలేసుకోకుండా, ప్రతి చినుకును ప్రవాహంలో కలుపుకుపోతేనే ప్రయోజనం ఉంటుంది. జనసేన పొత్తుతోనే సరిపెట్టుకోకుండా టీడీపీ పెద్దన్న పాత్ర పోషిస్తూ ఆంధ్రప్రదేశ్‌లో వివిధ ప్రజాసంఘాలను, సమూహాలను, సీపీఐ, సీపీఎం, కాంగ్రెస్, బీఎస్పీ, లోక్‌సత్తా, దళిత సంఘాల్ని, రైతు సంఘాల్ని, మేధావులను కలుపుకుని ముందుకు నడిచినప్పుడే విజయం సాధిస్తుంది. రాజకీయాల్లో ఎవరితో కలుస్తున్నామనేది కూడా చాలా కీలకం. తెలంగాణలో బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటే అనే సందేశం బలంగా వెళ్లడం వల్ల ఆ రెండు పార్టీలూ నష్టపోయాయి. బీజేపీతో దోస్తీ ధృతరాష్ట్రుడి కౌగిలి అన్న విషయాన్ని వైఎస్ఆర్‌సీపీ, టీడీపీ, జనసేన ఎంత త్వరగా గ్రహిస్తే అంత మంచిది. విభజన




హామీలు నెరవేర్చని బీజేపీపై ఏపీ ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. మణిపూర్ సంఘటన తరువాత క్రైస్తవ సమాజం బీజేపీపై తీవ్ర అసంతృప్తితో ఉంది. ముస్లిం కూడా ఈసారి ఎట్టిపరిస్థితుల్లో బీజేపీతో జతకట్టిన పార్టీకి బుద్దిచెప్పాలని కంకణం కట్టుకున్నారు. ఈ సూక్ష్మాన్ని గ్రహించకుండా మైనార్టీల ఆకాంక్షలకు వ్యతిరేకంగా నోటాతో పోటీపడుతూ, ఏపీలో అంటరాని పార్టీగా ఉన్న బీజేపీతో ఏ పార్టీ జతకడితే ఆ పార్టీ రాజకీయంగా తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుంది. తెలంగాణలో బీఆర్ఎస్ వైఫల్యానికి, ఓటమికి ప్రధానకారణం సిట్టింగ్ ఎమ్మెల్యేలపై ఉన్న తీవ్ర వ్యతిరేకతే. సిట్టింగులపై తీవ్ర వ్యతిరేకత ఉందని ఎన్నికల ముందు పలు సర్వేలు చెప్పినప్పటికీ బీఆర్ఎస్ ఒంటెత్తుపోకడలతో సిట్టుంగులకే సీట్లు ఇచ్చి చేతులు కాల్చుకుంది. ఏపీలోనూ దాదాపు 40 శాతం మంది వైఎస్సార్సీపీ సిట్టింగ్ ఎమ్మెల్యేలపై తీవ్ర వ్యతిరేకత ఉందని క్షేత్రస్థాయిలోని పరిస్థితులు తెలియజేస్తున్నాయి. వీరికి తోడు రాష్ట్రంలోని వైఎస్సార్సీపీ స్థానిక సంస్థల ప్రతినిధులపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి ఉంది. వీరి పనితీరు, వ్యవహారశైలీ, అవినీతితో ప్రజల్లో ఏర్పడిన వ్యతిరేకత రాష్ట్రంలో వైఎస్సార్సీపీకి పెను సవాల్ కాబోతోంది. రాబోవు ఎన్నికల్లో వీరే పార్టీకి గుదిబండగా మారబోతున్నారు. తెలంగాణలో బీఆర్ఎస్‌కి బలమైన పోల్ మేనేజ్‌మెంట్ వ్యవస్థ ఉందని, దానిని తట్టుకోవడం కాంగ్రెస్, బీజేపీ వల్ల కాదనే ప్రచారం ఎన్నికల ముందు పెద్ద ఎత్తున జరిగింది. కానీ ప్రజా వ్యతికేత ముందు పోల్ మేనేజ్‌మెంట్ పనిచేయలేదు. బీఆర్ఎస్ నాయకుల ఒంటెత్తుపోకడలతో నాయకత్వానికి, కార్యకర్తలకు మధ్య బంధం తెగిపోయింది. "నా కుమారుడికి జగన్ అంటే ప్రాణం. ఆయనకు కూడా ఉండాలిగా మన మీద ఉండాలని కోరుకుంటున్నా" అని రెండు రోజుల క్రితం వైఎస్ఆర్‌సీపీ అధినేతకు అత్యంత సన్నిహితులు బాలినేని శ్రీనివాసరెడ్డి చేసిన ప్రకటన గమనిస్తే పార్టీ అధినేతకు, నాయకులకు, కార్యకర్తలకు బంధం తెగిపోయినట్లు స్పష్టమౌతోంది. ఏపీలో వాలంటీర్లతో పోల్ మేనేజ్‌మెంట్ పటిష్టంగా జరుగుతుందని వైఎస్ఆర్‌సీపీ భావిస్తోంది. ఇప్పటికే ప్రభుత్వ వ్యతిరేకత ఉందని, దీనికి తోడు వాలంటీర్ల వ్యవస్థతో తమకు ప్రాధాన్యత కూడా తగ్గిందని వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలే సొంత పార్టీ మీద కోపం ప్రదర్శించడం క్షేత్రస్థాయిలో స్పష్టంగా కనబడుతోంది. ఈ పరిణామాలపై దిద్దుబాటు చర్యలు తీసుకోకపోతే వైఎస్ఆర్‌సీపీ తీవ్రంగా నష్టపోవడం ఖాయం.సీఎం జగన్ తన మేనిఫెస్టోలోని 95 శాతం హామీలు అమలు చేస్తున్నారు. రాష్ట్రంలో ప్రతి కుటుంబానికి ఏదో ఒక విధంగా సంక్షేమ పథకాలు అందుతున్నాయి. ఈ సంక్షేమ పథకాలే తనను గెలిపిస్తాయని జగన్ ప్రభుత్వం భావిస్తోంది. ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్‌లో జగన్ కంటే ఎక్కువ సంక్షేమ పథకాలు అందించిన కాంగ్రెస్ అక్కడ ఓడిపోయిందనేది ఇక్కడ గమనార్హం. వినూత్న పథకాలతో దేశం దృష్టిని తనవైపు తిప్పుకున్న కేసీఆర్ కూడా తెలంగాణలో గట్టెక్కలేకపోయారు. జగన్ బటన్ నొక్కుతారు, అందరికీ డబ్బులేస్తారు. క్షేత్రస్థాయిల పరిస్థితులను గమనించినప్పుడు కుడిచేత్తో ఇచ్చి ఎడమ చేత్తో లాక్కుంటున్నారనే అభిప్రాయం ఏపీ ప్రజల్లో ఉంది. వివిధ ట్యాక్స్‌లు, నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదల ముందు ప్రభుత్వం ఇస్తున్న సంక్షేమ పథకాలు దిగదుడుపే.రాష్ట్రంలో అవినీతి, కక్ష్య సాధింపు ధోరణి పెరిగిందని, అభివృద్ధి కుంటుపడిందనే అసంతృప్తి ఏపీ ప్రజల్లో నెలకొంది. మనిషి ముందు ఊపిరి పీల్చుకోవడానికి స్వేచ్ఛావాయువులు కోరుకుంటాడు. తర్వాతే తిండి గురించి ఆలోచిస్తాడు. పథకాలిస్తున్నాము కదా అని గొంతునొక్కితే ప్రజలు ఎదురు తిరుగుతారు. వారికి ఎన్నికలే వజ్రాయుధం. తెలంగాణలో కేసీఆర్ చేసినట్టే ఏపీలో జగన్ కక్షపూరిత రాజకీయాలతో గొంతు నొక్కుతున్నారనే భావన బలంగా ఉంది. ఇది వైఎస్సార్సీపీకి మాయని మచ్చగా మారిందనడంలో ఎలాంటి సందేహం లేదు. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్.రాజశేఖర్ రెడ్డి లాంటి పాలన అందిస్తారనే నమ్మకంతో ప్రజలు జగన్ కోరినట్టు ఒక్క చాన్స్ ఇచ్చారు. కానీ, ఈ అవకాశాన్ని ఆయన సద్వినియోగం చేసుకోలేకపోయారనే అభిప్రాయం ప్రజల్లో నెలకొంది. జనరంజక పాలన అందించడంలో, సంక్షేమాన్ని, అభివృద్ధిని సమపాళ్లలో అందించడంలో ఆయన విఫలమయ్యారు. దీనిని కప్పి పుచ్చడానికి జగన్ 'క్లాస్ వార్' నినాదాన్ని ఎత్తుకున్నారు. ఆయన ఎన్ని చెప్పినా ఆంధ్రాలో ఎప్పటిలాగే క్యాస్ట్ వారే జరుగుతుందని క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే తెలుస్తోంది. తెలంగాణ ఎన్నికల్లో ముదిరాజ్‌లు, రెడ్లు బీఆర్ఎస్‌ని వర్గ శత్రువుగా చూసినట్టే ఆంధ్రాలో కాపులు, కమ్మవారు, వైశ్యులు, రాజులు, బీసీల్లోని కొన్ని సామాజికవర్గాల వారు వైఎస్సార్సీపీని వర్గ శత్రువుగా చూస్తున్నారు. వైఎస్ఆర్‌సీపీకి ప్రధాన మద్దతుదారులైన సామాజికవర్గం తెలంగాణ ఎన్నికల ఫలితాలు వచ్చిన తరువాత "మా వాడు తెలంగాణలో ముఖ్యమంత్రి అయ్యాడు, ఏపీలో ఎవరు ముఖ్యమంత్రి అయితే మాకేమిటి?" అని బహిరంగంగానే మాట్లాడుకోవడాన్ని బట్టి ఆ సామాజికవర్గం వైఎస్ఆర్‌సీపీ పట్ల అసంతృప్తితో ఉన్నట్లు స్పష్టమతోంది. 2024 ఎన్నికల్లో 2019 ఎన్నికల్లో మద్దతిచ్చిన సామాజికవర్గాలు రాబోయే ఎన్నికల్లో ఎంతవరకు అండగా నిలబడుతాయో అనే దానిపై వైఎస్ఆర్‌సీపీ రాజకీయ భవిష్యత్తు ఆధారపడి వుంటుంది. క్షేత్రస్థాయిలో పరిస్థితులను అధ్యయనం చేసినప్పుడు 2019 ఎన్నికల్లో వైఎస్ఆర్‌సీపీకి మద్దతిచ్చిన సామాజికవర్గాల్లో మార్పు వచ్చినట్లు స్పష్టం కనబడుతోంది.ప్రభుత్వ వ్యతిరేతకు సంబంధించి ప్రజలు అవకాశం వచ్చినప్పుడల్లా ఓటు అనే వజ్రాయుధం ద్వారా సంకేతాలు పంపిస్తుంటారు. కానీ, తమ తప్పులను ఒప్పుకోవడానికి పాలకులకు అహం అడ్డొస్తుంటుంది. ఆ అహమే ఆ పార్టీల పతనానికి దారి తీస్తుంది. కేసీఆర్ అనుసరించిన నియంతృత్వ విధానాల వల్ల 2018 ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలిచిన కొన్ని నెలల వ్యవధిలోనే ప్రజా వ్యతిరేకత మొదలయ్యింది. అప్పటి నుంచే ప్రజలు ప్రత్యామ్నాయాన్ని వెతకడం మొదలుపెట్టారు. ఆ తర్వాత జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో, జీహెచ్ఎంసీ ఎన్నికల్లో, వివిధ ఉప ఎన్నికల్లో ఆ పార్టీ గ్రాఫ్ నెమ్మదిగా పడిపోతూ వచ్చింది. ఈ సంకేతాలను పట్టించుకోకపోవడం వల్ల బీఆర్ఎస్ తగిన మూల్యం చెల్లించుకుంది. ఏపీలో కూడా 151 స్థానాలు గెలిచిన వైఎస్సార్సీపీపై అధికారంలోకి వచ్చిన నెల రోజుల నుండే వ్యతిరేకత పెరగడం మొదలయ్యింది. దానికి కారణం కక్ష సాధింపుతో ప్రజావేదికను కూల్చడం.

# సమాఖ్య స్ఫూర్తికి విఘాతం




జమ్ముకాశ్మీర్ ప్రత్యేక ప్రతిపత్తిపై సుప్రీం తీర్పు కేంద్రప్రభుత్వ ఏకపక్ష, అప్రజాస్వామిక వైఖరికి సమర్ధన. సమాఖ్య వ్యవస్థకు, ప్రజాస్వామ్య నిబంధనలకు, చట్టపరమైన ప్రక్రియలకు తీరని విఘాతం. న్యాయవ్యవస్థ గౌరవాన్నిసైతం తగ్గించేదిగా ఉంది. కేంద్రం తలచుకుంటే ఏమైనా చేయొచ్చనే ఏకపక్ష దురహంకార వైఖరికి వత్తాసు పలికినట్టుగా అనిపిస్తుంది. జమ్ముకాశ్మీర్ ప్రత్యేక ప్రతిపత్తి రద్దుపై ఐదుగురు సభ్యుల సుప్రీంకోర్టు ధర్మాసనం మోడీ ప్రభుత్వ చర్యను రాజ్యాంగపరంగా లేదా చట్టబద్ధంగా సమర్థించలేకపోయింది. ప్రత్యేక హెూదా ఉపసంహరణ ప్రభుత్వ విధాన నిర్ణయమని, అందులో జోక్యం చేసుకోకూడదని కోర్టు చిత్రమైన వాదనను ముందుకు తెచ్చింది. ఆ రాష్ట్రాన్ని రెండు కేంద్ర పాలిత ప్రాంతాలుగా పునర్వ్యవస్థీకరించడం రాజ్యాంగంలోని ఆర్టికల్ 3 కింద అనుమతించదగినదా? కాదా? అనేది తాము తేల్చ దలచుకోలేదనడం మరో విడ్డూరం. 2019 ఆగస్టు 5 నాటికి రాష్ట్రపతి పాలనలో ఉంది. ఎన్నికైన శాసన సభ లేకపోగా, గవర్నర్ సమ్మతినే రాష్ట్ర సమ్మతిగా పరిగణించారు. దీనిని సమర్ధించడం ద్వారా రాష్ట్రపతి పాలన విధించబడే, దాని సరిహద్దులు మార్చబడే, రాష్ట్రహెూదా రద్దు చేయబడే ఇతర రాష్ట్రాలపై దీని ప్రభావం తీవ్రంగా ఉంటుంది. ఒక రాష్ట్రానికి సంబంధించి ఎటువంటి తీవ్రమైన నిర్ణయమైనా, చట్టమైనా, శాసనమైనా చేసే హక్కు పార్లమెంట్‌కు ఉందన్న కోర్టు తీర్పు అనేక కొత్త సమస్యలకు దారితీస్తుంది. పైగా ఒక రాష్ట్రాన్ని రెండు కేంద్ర పాలిత ప్రాంతాలుగా విభజించడం దేశంలో ఇదే తొలిసారి. ఆర్టికల్ 370 తాత్కాలికమేనని, భారత యూనియన్‌లో చేరిన తర్వాత జమ్మూ కాశ్మీర్‌కు సార్వభౌమాధికారం లేకుండా పోయిందని న్యాయస్థానం కేంద్రం చేసిన అన్ని రాజ్యాంగ విరుద్ధ చర్యలను సమర్థించింది. భారత యూనియన్‌లో జమ్ముకాశ్మీర్ విలీనం ఇప్పుడు రద్దు చేసిన 370వ అధికరణలో హామీ ఇచ్చిన ప్రత్యేక హెూదా నిలుపుకునే షరతుమీదే జరిగాయన్న అంశాన్ని సుప్రీం విస్మరించింది.

దేశంలో అన్ని రాష్ట్రాల మాదిరిగానే జమ్ముకాశ్మీర్ కూడానని పేర్కొనడం ద్వారా 371వ అధికరణలోని వివిధ క్లాజుల కింద ఈశాన్య రాష్ట్రాలకు, మరికొన్ని రాష్ట్రాలకు ఇచ్చిన ప్రత్యేక హక్కులు కూడా కోల్పోయేలా తాజా తీర్పు ఉంది. దీని ప్రకారం జమ్ముకాశ్మీర్‌లోని కొంత భాగానికే రాష్ట్రహెూదా పునరుద్ధరిస్తారు. లడక్ కేంద్రపాలిత ప్రాంతంగానే కొనసాగుతుంది.

## భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్.ఎఫ్.ఐ) జిల్లా మహాసభలను జయప్రదం చేయండి

**ఎస్ఎఫ్.ఐ జిల్లా అధ్యక్షులు గండి సునీల్ కుమార్**



పోరుమామిళ్ల ప్రజా పాలన ప్రతినిధి : డిసెంబర్ 18,19వ తేదీ తేదీలలో జరగనున్న భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్.ఎఫ్.ఐ) కడప జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు పిలుపునిచ్చారు. బుధవారం పోరుమామిళ్లలోని స్థానిక ఎస్సీ హాస్టల్ లో మహాసభ పోస్టర్లను వారు విడుదల చేశారు. ఈ సందర్భంగా గండి సునీల్ కుమార్ లు మాట్లాడుతూ... విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం అధ్యయనం పోరాటం నినాదంతో, స్వాతంత్ర్యం, ప్రజాస్వామ్యం, సోషలిజం లక్ష్యంగా 1970 డిసెంబర్ లో ఏర్పాటైన భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్.ఎఫ్.ఐ) అప్పటి నుండి ఇప్పటివరకు పేద, మధ్యతరగతి విద్యార్థులకు అండగా, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విద్యా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా విద్యార్థులను సంఘటితం చేస్తూ అనేక పోరాటాలు నిర్వహించి ఎన్నో విజయాలను సొంతం చేసుకుందని వారు తెలిపారు. రాష్ట్ర విభజన సమయంలో రాష్ట్రానికి ఇచ్చిన హామీలను అమలు చేయకుండా బీజేపీ ప్రభుత్వం రాష్ట్రానికి అన్యాయం చేస్తున్నదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విభజన హామీల అమలుకు ఏమాత్రం ప్రయత్నం చేయడం లేదన్నారు. ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకునేందుకు విద్యార్థులకు నాణ్యమైన విద్య కోసం అనునిత్యం పోరాడుతూ గత కార్యక్రమాలను సమీక్షించుకుని భవిష్యత్ కార్యాచరణ రూపొందిచుకునేందుకు భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్.ఎఫ్.ఐ) జిల్లా మహాసభలు డిసెంబర్ 18,19 పోరుమామిళ్ళ మండలంలో నిర్వహిస్తున్నామని వారు తెలిపారు. ఈ మహాసభలకు జిల్లా నుండి ప్రతినిధులు హాజరవుతున్నారని కావున ఈ మహాసభలను జయప్రదం చేయాలని వారు విద్యార్థి లోకానికి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎస్.ఎఫ్.ఐ ఉపాధ్యక్షుడు ఎద్దు రాహుల్, సహాయ కార్యదర్శి వీరపోగు రవి, నాయకులు విజయ్ భాస్కర్, గుర్రప్ప సుబ్బయ్య లు పాల్గొన్నారు.

## జగన్ ప్రభుత్వంలో అంగన్వాడీలకు సంక్షేమం అందని ద్రాక్షగా మారింది: ముద్దరబోయిన



నూజివీడు, డిసెంబర్ 13, ప్రజాపాలన ప్రతినిధి: జగన్ రెడ్డి ప్రభుత్వంలో అంగన్వాడీలకు సంక్షేమం అందనీ ద్రాక్షగా మారిందని గత టిడిపి ప్రభుత్వంలో నారా చంద్రబాబు నాయుడు అంగన్వాడీ జీతాలను రూ.6300 లకు పెంచితే ఈ జగన్ రెడ్డి మాత్రం వెయ్యి రూపాయలు పెంచి చేతులు దులువుకున్నాడని నూజివీడు నియోజకవర్గ ఇంచార్జి ముద్దరబోయిన వెంకటేశ్వరరావు అన్నారు. సమస్యల పరిష్కారం కోరుతూ అంగన్వాడి కార్యకర్తలు చేపట్టిన నిరవధిక సమ్మె, నిరసన దీక్షలు రెండవ రోజుకు చేరిన నేపథ్యంలో ముద్దరబోయిన వెంకటేశ్వరరావు, జనసేన నూజివీడు సమన్వయకర్త బర్మా ఫణి బాబు తో కలిసి అంగన్వాడీలకు తమ నైతిక మద్దతును తెలిపారు. ఈ సందర్భంగా ముద్దరబోయిన మాట్లాడుతూ ఒక చెత్తో ఇచ్చి మరో చేత్తో లాక్కోవడంలో జగన్ రెడ్డి ఆరి తేరారన్నారు. అంగన్వాడీ కార్యకర్తలకు, సహాయకులకు వెయ్యి రూపాయలు జీతం పెంచినట్లే పెంచి టి.ఏ ల రూపేనా 1500 రూపాయలు కోతకోశాడన్నారు. ఫలితంగా అంగన్వాడీ కార్యకర్తలకు తీరని ద్రోహం చేశాడని వచ్చే ఎన్నికల్లో అంగన్వాడీలు జగన్ కి బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. 2014 ముందు వరకు అంగన్వాడీ జీతాలు రూ.4200లు ఉండగా కార్యకర్తల జీతాలు మూడువేల రూపాయల వరకు ఉన్నాయని, వాటిని కార్యకర్తలకు రూ.10,500, సహాయకులకు రూ.6000 వరకు పెంచడంతో పాటు 18,301 అంగన్వాడి కేంద్రాలను టిడిపి ప్రభుత్వ హయాంలో నిర్మించామన్నారు. వైసిపి ప్రభుత్వం మాత్రం నాడు-నేడు పేరుతో వేల కోట్లు ఖర్చుపెట్టి అంగన్వాడి కేంద్రాలను ఆదు నికరిస్తామని ఊదరగొట్టిందే తప్ప చేసింది ఏమీ లేదన్నారు. పైపెచ్చు మినీ అంగన్వాడి కార్యకర్తలతో వెట్టి చాకిరి చేయిస్తూ సహాయకులకు ఇచ్చే జీతం ఇస్తున్నారన్నారు. ఉద్యోగ భద్రత కల్పించాలని, కనీస వేతనం చెల్లించాలని, పెన్షన్ పి.ఎఫ్ గ్రాడ్యుటి వంటి అమలు చేయాలని నాలుగేళ్లగా అంగన్వాడి కోరుతున్న ప్రభుత్వం పెడచెవిన పెట్టిందన్నారు. పాల బకాయిలు కోట్లలో ఉన్నాయని టి.ఏ బిల్లులు ఇవ్వలేదని ఒక్కొక్క కార్యకర్తకు పదివేల నుంచి 20వేల వరకు చెల్లించాల్సి ఉన్నా ప్రభుత్వం కనీసం దృష్టిసారించడంలేదన్నారు. కనీస వేతనం 26 వేలు చేయాలని సీనియార్టీ ప్రకారం వేతనాలు ఇవ్వాలని సుప్రీంకోర్టు తీర్పు అనుసరించి గ్రాడ్యువిటీ రిటైర్మెంట్ బెనిఫిట్ ఐదు లక్షలు వేతనంలో సగం పెన్షన్ ఇవ్వాలని అంగన్వాడీల డిమాండ్ కు నైతిక మద్దతు అందిస్తున్నట్లు ఈ సందర్భంగా ముద్దరబోయిన తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు మలిశెట్టి జగదీష్, తెలుగుదేశం పార్టీ నాయకులు నూతక్కి వేణుగోపాలరావు, అట్లూరి రవీంద్ర, ప్రధాన కార్యదర్శి పల్లి నాగరాజు, తలపంటి రాజశేఖర్, కౌన్సిలర్ కొమ్మని విజయం, అంగన్వాడి డ్వాక్రా మహిళ నాయకురాలు సయ్యద్ నజీమ్ మున్నిసా, జనసేన నాయకులు ముత్యాల కామేష్, రాష్ట్ర తెలుగు యువత కార్యనిర్వహణ కార్యదర్శి గద్దె రఘుబాబు, తెలుగుదేశం, జనసేన పార్టీల నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

**ఓట్లు నమోదు, మార్పులు, చేర్పుల ప్రక్రియలో పూర్తి పారదర్శకంగా వ్యవహారించాలని కోరుతూ సబ్ కలెక్టర్ కు వినతిపత్రం అందించిన ముద్రబోయిన**

ఓట్లు నమోదు, మార్పులు, చేర్పుల ప్రక్రియలో పూర్తి పారదర్శకంగా వ్యవహరించాలని, అధికార పార్టీ అక్రమాలను గుర్తించి తగు చర్యలు తీసుకోవాలని కోరుతూ నూజివీడు నియోజకవర్గ టిడిపి ఇన్చార్జి మాజీ శాసనసభ్యులు ముద్దరబోయిన వెంకటేశ్వరరావు బుధవారం నూజివీడు సబ్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్ర కు వినతి పత్రం అందించారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో అధికార పార్టీ అక్రమాలకు తెరలేపేలా దాదాపు పదివేల ఓట్లను నియోజకవర్గం నుంచి తొలగించేందుకు చూడడంతో పాటు, భారీగా దొంగ ఓట్లు నమోదు చేసేందుకు ప్రయత్నించిందని తమకు తెలుస్తోందన్నారు. ఉద్దేశపూర్వకంగా చేపడుతున్న ఈ చర్యలకు సంబంధించి వైసీపీ బూత్ ఏజెంట్లపై క్రిమినల్ చర్యలు తీసుకోవాల్సిందిగా ఈ సందర్భంగా ముద్దరబోయిన సబ్ కలెక్టర్ ను కోరారు. ఓట్ల నమోదు తొలగింపులో ప్రతి అప్లికేషన్ ను క్షుణ్ణంగా పరిశీలించిన పిదప చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా ఈవీఎం పనితీరుపై మోడల్ ను సబ్ కలెక్టర్ సమక్షంలో ఎన్నికల అధికారులు ప్రదర్శించగా ముద్దరబోయిన, టిడిపి, జనసేన శ్రేణులతో కలసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పట్టణ టిడిపి అధ్యక్షులు మల్లిశెట్టి జగదీష్, రాష్ట్ర తెలుగు యువత కార్యనిర్వహణ కార్యదర్శి గద్దె రఘుబాబు, ప్రధాన కార్యదర్శి పల్లి నాగరాజు, నాయకులు నూతక్కి వేణుగోపాలరావు, తలపంటి రాజశేఖర్, గోగినేని మధు కిరణ్, పాదం సత్యనారాయణ, కౌన్సిలర్ కొమ్మని విజయ, సయ్యద్ నజీమ్ మున్నిసా, జనసేన నాయకులు ముత్యాల కామేష్, తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడీల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలి.. : టిడిపి నేత మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు



పామర్రు ప్రజా పాలన ప్రతినిధి : కంకిపాడు ఐసిడిఎస్ ప్రాజెక్ట్ కార్యాలయం ఎదుట రెండో రోజు అంగన్వాడి కార్యకర్తలు ఆయాలు దీక్షలో పాల్గొన్నారు. దీక్షలకు తెలుగుదేశం పార్టీ సంపూర్ణ మద్దతునిస్తోందని అంగన్వాడీల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని కృష్ణా జిల్లా టిడిపి అధ్యక్షులు మాజీ పార్లమెంటు సభ్యులు కొనగల నారాయణరావు డిమాండ్ చేశారు. కృష్ణాజిల్లా కంకిపాడు ఐసిడిఎస్ ప్రాజెక్టులో జరిగిన ఆందోళన కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర నాయకులు మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరావు మాజీ ఎంపీ కొనగల నారాయణరావు పెనమలూరు నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు బోడె ప్రసాదులు దీక్షా శిబిరానికి చేరుకొని తమ సంపూర్ణ మద్దతును ప్రకటించారు. సందర్భంగా టిడిపి నాయకులు మాట్లాడుతూ అంగన్వాడీ కార్యకర్తల న్యాయమైన డిమాండ్ల పరిష్కరించడంలో వైసీపీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. గ్రామ స్థాయిలో అంగన్వాడీ కార్యకర్తలు చేస్తున్న సేవలను రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి న్యాయమైన సమస్యలను పరిష్కరించేలా తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రానున్న కాలంలో టిడిపి ప్రభుత్వం అధికారంలోకి రాగానే అంగన్వాడీ కార్యకర్తల న్యాయమైన సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టేందుకు టిడిపి అధిష్టానం నిర్ణయించిందని రానున్న కాలంలో అంగన్వాడీలకు మంచి రోజులు మాజీ ఎంపీ కొనగల నారాయణరావు మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా ఐసిడిఎస్ రంగంలో అనేక ఇబ్బందులు పడుతూ విధులు నిర్వహిస్తున్న అంగన్వాడీ కార్యకర్తలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి గ్రాడ్యుటి ఇతర సమస్యలు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు అంగన్వాడీ కార్యకర్తల ఆందోళనకు టిడిపి సంపూర్ణ మద్దతునిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నియోజకవర్గస్థాయి మండల స్థాయి నాయకులతో పాటు అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు సిఐటియు నాయకులు ఇతర ప్రజా సంఘాలకు చెందిన పలువురు నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.


## ఆశా కార్యకర్తలను పర్మినెంట్ చేయాలి..

**సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు బి. రాజేష్ డిమాండ్**



పామర్రు ప్రజాపాలన ప్రతినిధి : ఆశ కార్యకర్తలను తక్షణమే ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి పర్మినెంట్ చేయాలని సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు బి. రాజేష్ అన్నారు.ఆశ కార్యకర్తల సమస్యలు పరిష్కారం చేయాలని కోరుతూ ఈనెల 14 15 జిల్లా కలెక్టర్ ఆఫీస్ ముందు వంట వార్పు కార్యక్రమం ఏర్పాటు చేశారని ఆశా కార్యకర్తలు పాల్గొని జయప్రదం చేయవలసిందిగా కోరారు. మంగళవారం నాడు ఉయ్యూరు లోనే ఆషా డే సమావేశంలో రాజేష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆశా కార్యకర్తలకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని అన్నారు. అధికారంలోకి రాకముందు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వ అనేక వాగ్దానాలు ఇచ్చారని ,అధికారంలోకి వచ్చాక వాటిని అమలు చేయడంలో మార్చారని అన్నారు. ఆశా కార్యకర్తల పని భారం తగ్గించాలి. కమ్యూనిటీ హెల్త్ వర్కర్లు ఆశలుగా మార్పు చేయాలి.ఏ కారణంతో నైనా ఆశలు మరణిస్తే ఆ కుటుంబానికి వెంటనే పది లక్షలు ఇన్సూరెన్స్ ఇవ్వాలని కోరారు.ఆశా కార్యకర్తలు రిటైర్మెంట్ బెనిఫిట్ వంటి వసతులు ప్రభుత్వం ఇస్తున్న సంక్షేమ పథకాల అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆశ వర్కర్ యూనియన్ నాయకులు తహిర బేగం శంషా బేగం, బస్వంతి, పరిశుద్ధం, తదితరులు పాల్గొన్నారు.

## అందరికీ సంక్షేమమే "వికసిత భారతి సంకల్ప యాత్ర" లక్ష్యం



నూజివీడు, డిసెంబర్ 13, ప్రజాపాలన ప్రతినిధి: అందరికీ సంక్షేమ పథకాలు అందించే లక్ష్యంతో వికసిత భారతి సంకల్పయాత్ర కొనసాగిస్తున్నట్లు నూజివీడు నియోజకవర్గ భారతీయ జనతా పార్టీ సమన్వయకర్త జి ఆర్ కె రంగారావు తెలిపారు. నూజివీడు పట్టణంలో ఆయన బుధవారం మాట్లాడుతూ ఆత్మనిర్బర్ భారత్ స్వావలంబన భారతం సాధనలో అభివృద్ధి చెందిన దేశంగా ఎదిగే క్రమంలో అంత్యోదయ కింద అట్టడుగు వారికి ముందుగా సంక్షేమ పథకాలు అందించే దిశగా వికసిత భారతి సంకల్పయాత్ర కొనసాగిస్తున్నట్లు చెప్పారు. ఈ యాత్రలో భాగంగా నూజివీడు నియోజకవర్గం ఈనెల 15వ తేదీ నుండి 27వ తేదీ వరకు గ్రామాలలో పర్యటించటం జరుగుతుందన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ ప్రవేశపెట్టిన వివిధ సంక్షేమ పథకాల గురించి ఈ యాత్ర ద్వారా ప్రజలకు వివరించటం జరుగుతుందన్నారు. ప్రజలందరూ ఈ యాత్రలో పాల్గొని దిగ్విజయం చేయాలని కోరారు.

























# ఎంపీ స్థానాలపై గురి...




భోపాల్, డిసెంబర్ 13 :మూడు రాష్ట్రాల్లో ముఖ్యమంత్రి ఎంపిక విషయంలో భారతీయ జనతా పార్టీ ఖతర్నాక్ వ్యూహాన్ని అమలు చేసింది. అన్ని వర్గాలను ఆకట్టకునేవిధంగా మధ్యప్రదేశ్, రాజస్థాన్, చత్తీస్ఘడ్‌ల్లో సీఎంల ఎంపిక జరిగింది. ఉత్తరాదిలో ఓబీసీ ఓటు బ్యాంక్‌పై ప్రధానంగా బీజేపీ గురిపెట్టింది. అందుకే మధ్యప్రదేశ్ సీఎం పదవిని మోహన్ యాదవ్‌కు కట్టబెట్టారు. దీని ప్రభావం ఉత్తర ప్రదేశ్, బీహార్‌లో గట్టిగా ఉంటుందని బీజేపీ హైకమాండ్ భావిస్తోంది.మూడు రాష్ట్రాల సీఎం పదవికి బీజేపీ ఖరారు చేసిన పేర్లను బట్టి చూస్తే 2024 లోక్ సభ ఎన్నికల ముద్ర స్పష్టంగా కనిపిస్తుంది. మూడు రాష్ట్రాల్లో ముఖ్యమంత్రుల పేర్లను ప్రకటించడంతో పాటు.. 2024కి రాజకీయ రంగం సిద్ధం చేసేందుకు ఆ పార్టీ ప్రయత్నిస్తోంది. అంతేకాకుండా, ఈ రాష్ట్రాల్లో కుల సమీకరణాలు సృష్టించాలని కూడా బీజేపీ కన్నేసింది.రానున్న లోక్‌సభ ఎన్నికల్లో 400కు పైగా స్థానాల్లో విజయం సాధించాలన్న లక్ష్యాన్ని భారతీయ జనతా పార్టీ పెట్టుకుంది. ఎవరు ఊహించని విధంగా మూడు రాష్ట్రాల్లో అందుకే ముఖ్యమంత్రులుగా కొత్త ముఖాలను తెరపైకి తెచ్చారు. బ్రాహ్మణ ఓటు బ్యాంక్ కూడా ఉత్తరాదిలో కీలకం. అందుకే రాజస్థాన్‌లో బ్రాహ్మణ సామాజిక వర్గానికి సీఎం పదవి ఇచ్చారు. మధ్యప్రదేశ్, రాజస్థాన్,చత్తీస్ఘడ్, ఉత్తరప్రదేశ్, బీహార్ కలిపి నార్త్‌బెల్ట్‌లో 200కు పైగా లోక్‌సభ సీట్లు ఉన్నాయి. అందుకే సీఎంల ఎంపికలో సామాజిక వర్గాలను ఎక్కువగా పరిగణ లోకి తీసుకున్నారు.

ఎంపీ సీఎంగా మోహన్ యాదవ్

మధ్యప్రదేశ్‌లో కుల సమీకరణాలతో రాజకీయాలు ఎక్కువ. ముఖ్యంగా కాంగ్రెస్ ఓబీసీ సమస్యను నిరంతరం లేవనెత్తుతోంది. అటువంటి పరిస్థితిలో, మధ్యప్రదేశ్‌లో మోహన్ యాదవ్‌ను రాష్ట్ర ముఖ్యమంత్రిని చేయడం ద్వారా జనంలో ఆదరణ పొందడంతో పాటు, ఒక వైపు కాంగ్రెస్‌కు బీజేపీ సమాధానం ఇచ్చినట్లైంది.

మరోవైపు ఓబీసీ ఓట్లను రాబట్టేందుకు కూడా ప్రయత్నాలు ముమ్మరం చేశారు. మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, బీహార్‌లలో ఓబీసీ ఓటు చాలా ముఖ్యమైనదిగా పరిగణించడం గమనార్హం. అటువంటి పరిస్థితిలో, మోహన్ యాదవ్‌ను ముందుకు తెచ్చి, హిందీ మాట్లాడే రాష్ట్రాల్లో లోక్‌సభ ఎన్నికలకు ముందు బీజేపీ అద్భుతమైన రాజకీయ పిచ్‌ను సిద్ధం చేసింది.

రాజస్థాన్‌లో భజన్‌లాల్ శర్మ

రాజస్థాన్‌లో భజన్‌లాల్ శర్మను ముఖ్యమంత్రిగా బీజేపీ ప్రకటించింది. దీంతో పాటు రాష్ట్రంలోని బ్రాహ్మణ ఓటర్లను తమవైపు తిప్పుకునేందుకు ఆ పార్టీ ప్రయత్నించింది. గణాంకాల ప్రకారం, రాజస్థాన్‌లో 89 శాతం హిందువుల జనాభా ఉంది. వీరిలో షెడ్యూల్డ్ కులాల జనాభా 18 శాతం కాగా, షెడ్యూల్డ్ తెగల జనాభా 13 శాతం. బ్రాహ్మణుల జనాభా దాదాపు ఏడు శాతం. అటువంటి పరిస్థితిలో, భాజన్‌లాల్ శర్మను ముందుకు తెచ్చి బ్రాహ్మణ ఓటర్లను ప్రలోభపెట్టడానికి బీజేపీ ప్రయత్నించింది. తన పటిష్టమైన ఓటర్లపై తన పట్టును కొనసాగించేందుకు, బీజేపీ బ్రాహ్మణ వ్యక్తిని ముందుకు తెచ్చింది.

ఛత్తీస్‌గఢ్‌లో విష్ణు దేవ్‌సాయి

ఛత్తీస్‌గఢ్‌లో గిరిజన ఓటర్లపై కన్నేసి ఉంచిన బీజేపీ గిరిజన ఓటర్లపై పట్టు పెంచుకునేందుకు విష్ణు దేవ్‌సాయిని ముఖ్యమంత్రిగా ప్రకటించింది భారతీయ జనతా పార్టీ హైకమాండ్. ఛత్తీస్‌గఢ్‌లో గిరిజన ఓటర్లను నిర్ణయాత్మకంగా పరిగణిస్తారు. ఇక్కడి జనాభాలో దాదాపు మూడింట ఒక వంతు మంది గిరిజనులు. 90 అసెంబ్లీ స్థానాలున్న రాష్ట్రంలో 29 స్థానాలు షెడ్యూల్డ్ కులాలకు రిజర్వ్ చేయడం జరిగింది. ఇది కాకుండా రాష్ట్రంలో 11 లోక్‌సభ స్థానాలు ఉన్నాయి. ఇందులో 4 సీట్లు గిరిజన వర్గానికి రిజర్వ్‌గా ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే గిరిజన సామాజికవర్గం నుండి ముఖ్యమంత్రిని చేసేందుకు ఛత్తీస్‌గఢ్‌లో బీజేపీ చేసిన ఎత్తుగడ గిరిజన సామాజిక వర్గానికి చెందిన ప్రజలు అధిక సంఖ్యలో నివసించే జార్ఖండ్, ఒడిశా వంటి రాష్ట్రాలపై కూడా ప్రభావం చూపుతుందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.అటు తెలంగాణలోనూ బీసీ, ఎస్సీ ఓటర్లకు గాలం వేసేందుకు బీజేపీ ప్రయత్నించింది. గత అసెంబ్లీ ఎన్నికల్లో అకస్మాత్తుగా వ్యూహం మార్చిన బీజేపీ బీసీలకు సీఎం పదవి ఇస్తామని హామీ ఇచ్చింది. జనాభా పరంగా తెలుగు నేల బీసీలు 50 శాతానికి పైగానే ఉన్నప్పటికీ రాజకీయ చైతన్యం ఇతర దక్షిణాది రాష్ట్రాలతో పోల్చితే తక్కువేనని అభిప్రాయం ఉంది. వివిధ పార్టీలలో బీసీ నాయకులకు పదవులు లభించినా ముఖ్యమంత్రి స్థాయిలో ఎవరూ ఎదగలేదు. ఈ నేపథ్యంలోనే తెలంగాణలో బీసీ మంత్రంతో పాగా వేసేందుకు బీజేపీ ప్రయత్నించింది.

# బీసీ అభ్యర్థిని సీఎం చేయడమే ఆల్ తెలుగు ప్రజా పార్టీ యొక్క లక్ష్యం

**పూలే అంబేద్కర్ రాజ్యాధికార సమితి రాష్ట్ర అధికార ప్రతినిధులు ముండ్లపాటి పిచ్చయ్య**



బద్వేల్, ప్రజాపాలన ప్రతినిధి: బుధవారం ప్రజాపాలన ప్రతినిధితో మాట్లాడుతూ రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటు కానున్న ఆల్ తెలుగు ప్రజా పార్టీని ప్రజలందరూ గౌరవించాలని ముఖ్యంగా ప్రజలను లక్షాధికారులుగా చేయడమే పార్టీ యొక్క సిద్ధాంతమని అన్నారు, నిరుద్యోగ యువతకు అన్ ఎంప్లాయిమెంట్ హఠావో పథకం పేరుతో నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు వచ్చినంత వరకు వారిని ప్రోత్సహించి వారికి జీవన ఉపాధి కల్పించడమే ప్రధాన ధ్వేయమని ముఖ్యంగా అన్ని కులాలను లక్షాధికారులు చేయడమే పార్టీ సిద్ధాంతమన్నారు ఏ పార్టీ చేయని రూపకల్పన ఆల్ తెలుగు ప్రజా పార్టీ చేస్తుందని అందుకు నిదర్శనం రాష్ట్రంలో సీఎం గా బీసీ అభ్యర్థులను ఎన్నుకోవడం ఒక అపూర్వ ఘట్టమన్నారు స్వాతంత్రం వచ్చి 76 సంవత్సరాల దాటుతున్న రెండు కులాల వారే పాలకులుగా ఉన్నారని అత్యధిక జనాభా గల ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీలు పాలకులు ఎందుకు కాకూడదు అనే ఉద్దేశ్యంతో ఆల్ తెలుగు పార్టీ ఏర్పాటు అయిందని ఈనెల 30వ తేదీన విజయవాడలో జాతికి అంకితం చేసే కార్యక్రమం ఉంటుందని పార్టీ విధివిధానాలను రూపు కల్పన ద్వారా ప్రజలకు తెలిపే విధంగా గొప్ప బహిరంగ సభ ఉంటుందని ఈ సభకు రాష్ట్రం నలుమూలల నుండి వేలాదిగా తరలిరావాలని అన్నారు ,ముఖ్యంగా మనమంతా కలిస్తే మనమే పాలకులవుతామని అంబేద్కర్ చెప్పిన విధంగా ఓటు అనే వజ్రాయుధంతో పాలకులు అవుతాము ఓటును అమ్ముకొని బానిసలం అవుతామని తెలుసుకోవాల్సిన సమయం ఆసన్నమైందని అన్నారు ,ఆంధ్రప్రదేశ్ లోని అన్ని జిల్లాల నుండి ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీలంతా విజయవాడ సభకు హాజరై పార్టీని ఆదరించాలని పార్టీలోని మేనిఫెస్టో అందరికీ ఉపయోగపడే విధంగా ఉందని అన్నారు కాబట్టి రాష్ట్ర ప్రజలారా ఆల్ తెలుగు ప్రజా పార్టీని ఆదరించండి మనమే పాలకొలవడం రాజ్యాధికారం దిశగా అడుగులు వేస్తాం సహకరించాలని కోరారు.

# డిప్లమో ఇన్ జర్నలిజం ఫలితాలు విడుదల..



విజయవాడ(ప్రజాపాలన ప్రతినిధి):సి.ఆర్. మీడియా అకాడమీ నిర్వహించిన "డిప్లమో ఇన్ జర్నలిజం" కోర్సు పరీక్షల ఫలితాల విడుదలయ్యాయి.మంగళవారం యూనివర్సిటీ వి.సి. చాంబర్‌లో జరిగిన ఒక కార్యక్రమం లో "డిప్లమో ఇన్ జర్నలిజం" కోర్సు పరీక్షల ఫలితాలను ఆచార్య నాగార్జున యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొ. రాజశేఖర్. పి, సి.ఆర్. మీడియా అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాస రావు లువిడుదల చేశారు.ఈ పరీక్షల్లో 178 మంది ఉత్తీర్ణత సాధించగా,39 మంది కి డిస్టింక్షన్,మొదటి శ్రేణి లో 103 మంది ద్వితీయ శ్రేణి లో 28 మంది, తృతీయ శ్రేణి లో 8 మంది ఉత్తీర్ణత సాధించారు.6 నెలల వ్యవధి కలిగిన "డిప్లమో ఇస్ జర్నలిజం" కోర్సును వర్కింగ్ జర్నలిస్టులు, జర్నలిజంలో అభిరుచి వున్న ఇతరులకు సి.ఆర్. మీడియా అకాడమీ, ఆచార్య నాగార్జున యూనివర్సిటీలు సంయుక్తంగా నిర్వహించిన సంగతి తెలిసిందే. ఈ డిప్లమో కోర్సులో 302 మంది జాయిన్ పరీక్షలలో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులకు సి.ఆర్. మీడియా అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాస రావు, సెక్రెటరీ మామిడిపల్లి బాల గంగాధర తిలక్ లు అభినందనలు తెలిపారు.అన్వేషి కొప్పుల 400 మార్కులకు గాను 315 మార్కులు సాధించి 78.5 శాతం తో మొదటిర్యాంకు సాధించగా, గంధగతెర సుధాకర్ 310 మార్కులు, 77.5శాతం తో ద్వితీయ,వెలమల ఈశ్వరరావు 309 మార్కులు, 77.25 శాతం తో తృతీయర్యాంకు సాధించారని చైర్మన్ కొమ్మినేని శ్రీనివాస రావు తెలిపారు. రెండు తెలుగు రాష్ట్రాల్లోని 6 పరీక్షా కేంద్రాల్లో 2023అక్టోబర్ 26 నుంచి, 30 వరకు ఈ పరీక్షలు నిర్వహించినట్లు కంట్రోలర్ ఆఫ్ ఎక్జామినేషన్స్‌తెలిపారు.ఈ కార్యక్రమం లో యూనివర్సిటీ రిజిస్ట్రార్, ప్రొ. బి. కరుణ, జర్నలిజం శాఖ హెడ్ ఆఫ్ దిడిపార్ట్మెంట్ డా. జి. అనిత, కంట్రోలర్ ఆఫ్ ఎక్జామినేషన్స్ శ్రీ బి. నర్సారెడ్డి, అడిషనల్‌కంట్రోలర్ ఆఫ్ ఎక్జామినేషన్స్ శ్రీ ప్రకాశరావు, డిప్లమో కోర్సు డైరెక్టర్ డా. ఎల్.వి.కె. రెడ్డి,సి.ఆర్. మీడియా అకాడమీ సెక్రెటరీ శ్రీ మామిడిపల్లి బాల గంగాధర తిలక్, ఓ.ఎస్.డి. శ్రీ ఎస్.శ్రీనివాస జీవన్ తదితర్లు పాల్గొన్నారు.

# సిపిఎం నాయకుడు ఖాదర్ బాషా ఆధ్వర్యంలో 40 కుటుంబాలు సిపిఐ ప్రజాసంఘాలలో చేరిక

**పేదలకు వెన్నుదన్నుగా నిలిచేది ఎర్రజెండానే**

**పేదలకు ఇంటి స్థలాలు ఇచ్చేంతవరకు అవిశ్రాంత పోరాటం చేస్తాం..**



గోపవరం ప్రజా పాలన ప్రతినిధి: గోపవరం మండలంలోని పి.పి కుంట గ్రామానికి చెందిన సిపిఎం నాయకుడు ఖాదర్ బాషా ఆధ్వర్యంలో 40 కుటుంబాలు సిపిఐ ప్రజా సంఘాలలో బుధవారం చేరినారు వీరికి సిపిఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర పార్టీ కండువాలు మెడలో వేసి సాధారంగా ఆహ్వానించారు ఈ కార్యక్రమానికి సిపిఐ మండల కార్యదర్శి గూడూరు పెంచలయ్య అధ్యక్షత వహించారు ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర మాట్లాడుతూ..... నిరంతరం ప్రజల పక్షాన నిలబడి ప్రతి పేదవాడికి కూడు గూడు గుడ్డ కావాలని నినదించే పార్టీ ఏదైనా ఉంది అంటే అది ఒక్క భారత కమ్యూనిస్టు పార్టీ మాత్రమే అని ఈనాడు సిపిఐ చేస్తున్న ప్రజా పోరాటాలకు ఆకర్షితులై ప్రజా సంఘాలైన వ్యవసాయ కార్మిక సంఘం, డిహెచ్పిఎస్, ఇన్సాఫ్ సంఘాలలో చేరారని ఆయన తెలిపారు గోపవరం మండలంలో వందల ఎకరాలు ప్రభుత్వ భూమి ఉన్నప్పటికీ అది కొంతమంది భూ బకాసురుల చేతుల్లో ఉందని అరకొర ప్రభుత్వ భూమి ఉంటే అయ్యా మాకు ఇల్లు లేవు భూములు లేవు అని ప్రభుత్వ భూమిలో ఎర్రజెండా పార్టీ పేదలు ఆక్రమిస్తే రెవిన్యూ పోలీస్ అధికారులు కడుపులో మండి ఆగమేఘాల మీద గుడిసెలను తొలగించి అన్యాయంగా అక్రమంగా కేసులు బనాయిస్తున్నారని పేదలకు ఇంటి స్థలం ప్రభుత్వ బంజర భూమి దక్కేంతవరకు సిపిఐ అవిశ్రాంత పోరాటం చేస్తుందని ప్రజలందరూ ఎర్రజెండా నాయకత్వంలో భాగస్వామ్యం కావాలని ఆయన పిలుపునిచ్చారు. బడుగు బలహీన వర్గాల కోసం పేద ప్రజల కోసం అహర్నిశలు పాటుపడుతూ ఈ దేశంలోనే మొట్టమొదటిగా ఏర్పడిన భారత కమ్యూనిస్టు పార్టీ త్వరలో శతాబ్ది ఉత్సవాలు కూడా జరుపుకోవాలని అలాంటి పార్టీలో ప్రజాసంఘాలలో మీరు చేరడం చాలా ఆనందంగా ఉందని ఆయన పేర్కొన్నారు సిపిఐ ప్రజాసంఘాల చేరిన వారిలో... ఆకా చంద్రశేఖర్, స్వామి దాసు, బాలసుబ్బయ్య, షేక్ సర్దార్ వలి, పెద్దపోలుపెంచలయ్య, ట్యాంక్ మస్తాన్, మాబు, ఖాజావలి, సుబ్బారెడ్డి, చేరారు ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వీర శేఖర్ ఏరియా సహాయ కార్యదర్శులు చంద్రమోహన్ రాజు, పిడుగు మస్తాన్, మండల కార్యదర్శి గూడూరు పెంచలయ్య ఏరియా కార్యవర్గ సభ్యులు బాలు, పీవీ రమణ, జి ఎల్ నరసింహ, నాగేష్ మహిళా సంఘం నాయకురాలు సలోమి, డిహెచ్పిఎస్ నాయకులు మునిరత్నం పాల్గొన్నారు

# తైక్వాండో పోటీలలో హెూలీ రోజరీ పాఠశాల విద్యార్థి ప్రతిభ



పోరుమామిళ్ల,ప్రజాపాలన ప్రతినిధి : ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని డెహ్రాడూన్ లో ఈనెల ఒకటి నుండి మూడవ తేదీ వరకు జరిగిన తైక్వాండో పోటీలలో పోరుమామిళ్ల పట్టణంలోని హెూలీ రోజరీ పాఠశాల విద్యార్థి సత్తా చాటారు, 6వ నేషనల్ క్యాడెట్ విభాగంలో హెూలీ రోజరీ పాఠశాలకు చెందిన షేక్ మహమ్మద్ అబుబాకర్, అనే విద్యార్థి పాల్గొని సాధించాడని పాఠశాల ప్రిన్సిపాల్ రెవ''ఫా'' సగిలి జైపాల్ మరియు వ్యాయామ ఉపాధ్యాయుడు వై గోవర్ధన్ తమ హర్షాన్ని వ్యక్తం చేసి విద్యార్థినని అభినందించారు, ఇలాంటి పథకాలు ఎన్నో సాధించి పాఠశాలకు తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని కోరారు,

# జగన్ బీసీ మంత్రం...


కాకినాడ, డిసెంబర్ 13, :ఏపీ సీఎం జగన్ బీసీ మంత్రం పఠిస్తున్నారు. గత ఎన్నికలకు ముందే బీసీలను టార్గెట్ చేసుకున్న జగన్.. ఎన్నికల మాత్రం ఓన్ చేసుకోవాలని చూస్తున్నారు. వారితోనే రెండోసారి విజయం సాధించాలని భావిస్తున్నారు. ఇందుకు తన సామాజిక వర్గాన్ని పణంగా పెడుతున్నారు. రెడ్డి సామాజిక వర్గం నేతలను బుజ్జగించి పక్కన పెడుతున్నారు. వారి స్థానంలో బీసీ నేతలతో పోటీ చేయించేందుకు ప్రత్యేక వ్యూహం రూపొందిస్తున్నారు. ఎక్కడికక్కడే స్థానిక పరిస్థితులకు అనుగుణంగా వెనుకబడిన వర్గాలకు చెందిన నాయకులను ఎన్నికల్లో పోటీ చేయించేందుకు కసరత్తు చేస్తున్నారు. బీసీ పార్టీగా ముద్ర పడిన టిడిపికి ఇది కంటి మీద కునుకు లేకుండా చేసే విషయమే.తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం తర్వాత.. ఉమ్మడి ఏపీలో బీసీ నాయకులు పుట్టుకొచ్చారు. ఒక విధంగా చెప్పాలంటే బీసీ నాయకులను తయారు చేసే ఫ్యాక్టరీ టిడిపిగా అభివర్ణించవచ్చు. 2019 ఎన్నికల వరకు బీసీలు తెలుగుదేశం పార్టీకి బలమైన మద్దతు దారులు. కానీ జగన్ తన సంక్షేమ తారక మంత్రంతో బీసీలను ఆకట్టుకునే ప్రయత్నం చేయడంలో సక్సెస్ అయ్యారు.వారిఓట్లను చీల్చగలిగారు.మెజారిటీ వర్గం అభిమానాన్ని చురగొన్నారు. ఇప్పుడు బీసీలకు రాజ్యాధికారం అప్పగిస్తానంటూ చెప్పుకొస్తున్నారు. ఓసి నియోజకవర్గాల్లో సైతం బీసీలను రంగంలోకి దించి ఓట్లను కొల్లగొట్టాలని చూస్తున్నారు. దీంతో టీడీపీ డిఫెన్స్ లో పడిపోయింది.ఇటీవల తెలంగాణ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ బీసీ ఫార్ములాను తెరపైకి తెచ్చింది. సామాజిక సాధికారత తమ అభిమతంగా చెప్పుకొచ్చింది. పార్టీ అధికారంలోకి వస్తే బీసీ సీఎం అన్న నినాదాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లింది. అయితే అది పెద్దగా వర్కౌట్ కాలేదు. కానీ బీసీలను మాత్రం ఆ పార్టీ ఆకట్టుకోగలిగింది. 2029 నాటికి ఇదే బీసీ నినాదంతో బిజెపి ముందుకెళితే తెలంగాణలో మంచి ఫలితాలు సాధించే అవకాశం ఉంది. అయితే దీనిని గ్రహించిన జగన్ బిసి సాధికారిక అంశాన్ని తెరపైకి తెచ్చి వెనుకబడిన వర్గాల నాయకులకు రాజకీయ ప్రోత్సాహం అందించాలని నిర్ణయించారు. అవకాశం ఉన్నచోట బీసీలకు టిక్కెట్లు ఇచ్చి.. వారి ఆమోదంతోనే రెండోసారి ఏపీలో గెలవాలని చూస్తున్నారు. మరి ఏం జరుగుతుందో చూడాలి.

# రెడ్డి కొట్టాలలో ఘనంగా ముగిసిన ఆరవ రోజు పాదయాత్ర




కడప జిల్లా ప్రజా పాలన ప్రతినిధి : కడప జిల్లా అవధూత కాశినాయన మండలం రెడ్డి కొట్టాలలో ఆశేష జన వాహిని మధ్య తెలుగుదేశం పార్టీ యువ నాయకులు నిర్వహిస్తున్న పాదయాత్ర ఆరవ రోజు ఘనంగా ముగిసింది. రైతులను మహిళలను ఎస్సీ ఎస్టీ బీసీ ప్రజలతో కలిసి సమస్యలను తెలుసుకుంటూ భరోసా కల్పిస్తూ సాగిన ఆరో రోజు పాదయాత్ర ఎంతో ప్రజల ఆదరాభిమానాలు మధ్య ముగిసింది. ప్రజా సమస్యలను తెలుసుకుంటూ కాశిరెడ్డి నాయన మండలంలో ఆయన ఆశీస్సులతో అభివృద్ధి పథంలో రాబోయే కాలంలో నడుపుతామని మన నాయకుడు తెలుగుదేశం పార్టీ అధినేత దృష్టికి తీసుకెళ్లి మండలాన్ని ప్రగతి పథంలో నడిపిస్తానని కాశి నాయన మండల ప్రజలకు ఆయన హామీ ఇచ్చారు. ఈ మండలంలో జరిగిన పాదయాత్రలో యువకులు ఉత్సాహంగా పాల్గొని విజయవంతం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ బద్వేల్ నియోజకవర్గ ఇన్చార్జి కే విజయమ్మ తెలుగుదేశం పార్టీ అభ్యర్థి బొజ్జ రోషన్న తెలుగుదేశం పార్టీ నాయకులు అభినేని రమణారెడ్డి రోహిత్ రెడ్డి, మురళి బాలాజీ డాక్టర్ పోలయ్య నరసింహులు బాలయ్య, శీను యువత మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు వచ్చిన ప్రతి ఒకరికి భోజనం వసతులు కల్పించడం జరిగింది

# 10 మంది మంత్రులు ఔటేనా..?




విజయవాడ, డిసెంబర్ 13,: వై నాట్ 175 అన్న వైసీపీ.. ఉన్న కాండిడేట్లను మార్చుకుంటూ వెళుతోంది. సోమవారం ఒకేసారి 11మంది ఇన్‌చార్జులను మార్చేసిన పార్టీ మరి కొంత మంది రెడీగా ఉండాలని సిగ్నల్ పంపేసింది. లేటెస్ట్ బజ్ ఏంటంటే.. కనీసం సగం మంది మంత్రులు, మాజీ మంత్రులకు టికెట్లు నిరాకరిస్తున్నారు. అవును ఇది నిజమే. జనంలో బాగా పాపులర్ అయిన మంత్రులను వక్కన పెట్టడవే కాదు.. కొంతమంది సీనియర్ మంత్రులను ఎంపీ స్థానాలకు పంపిస్తున్నారు. వైసీపీ క్యాంప్ నుంచి అందుతున్న లేటెస్ట్ సమాచారం ఏంటంటే.. ?అంబటి, రోజా, ఉషశ్రీ చరణ్, గుమ్మనూరు జయరాం, నారాయణ స్వామి, చెల్లుబోయిన, జోగి రమేష్, విడదల రజని, అంజాద్ భాషా, పినిపె విశ్వరూప్ మొత్తం 10మంది మంత్రులకు టికెట్లే లేవని చెబుతున్నారు. మరి కొంతమంది ఈ లిస్టులో చేరవచ్చు కూడా. 11మంది ఇన్ చార్జులను మారుస్తూ సోమవారం బయటకొచ్చిన లిస్టు జస్ట్ శాంపిల్ మాత్రమే. గెలుపే లక్ష్యంగా అని ఆల్రెడీ చెప్పేశారు కాబట్టి.. మంత్రుల స్థానాల మార్పునకు కూడా కారణం అదే అనుకోవాలి. ఏకంగా 65సీట్లలో మార్పులు చేర్పులు, తొలగింపులు జరుగుతుండటంతో మంత్రులు సైతం పక్కకు తొలగాల్సి వస్తోంది. అంబటి రాంబాబు వైసీపీకి పేరున్న ఫేస్. ప్రత్యర్థులపై మాటలతో దాడి చేసే ఈ మంత్రి సొంత జిల్లాలో మాత్రం వ్యతిరేకత ఎదుర్కొంటున్నారు. సత్తెనపల్లిలో అనేక సందర్భాల్లో ప్రజలు నేరుగా ఎదురుతిరిగిన సంఘటనలు ఉన్నాయి. వైఎస్‌కు ముఖ్య అనుచరుడిగా ఉండటం.. మొదట్లోనే కాంగ్రెస్ పార్టీ నుంచి వచ్చేసి జగన్‌తో నడవడం, పార్టీ పట్ల విధేయత అనేవి ఆయనకు మంత్రి పదవిని తెచ్చాయి తప్ప.. జిల్లా అంతటిని నడిపించగల సమర్థత వల్ల కాదు. మీడియాలో పాపులర్ అయిన ఆయన సొంత జనాలకు ఆకట్టుకోవడంలో విఫలమయ్యారు. ఇది గుర్తించే పక్కన పెడుతున్నారని, ఈ విషయం ఆయనకు చెప్పేయడం.. అంబటి ఒప్పుకోవడం కూడా జరిగిందని టాక్.ఎంతో కాలంగా పార్టీతో ఉన్న రోజాకు మొదటి విడతలో మంత్రిపదవి రాకపోవడంతో.. ఆమెకున్న పాపులారిటీ దృష్ట్యా రెండోసారి ఇచ్చారు. అయితే రాష్ట్ర వ్యాప్తంగా పాపులర్ అయిన రోజా.. సొంత నియోజకవర్గంలో మాత్రం ప్రజలకు దూరంఅయ్యారు. స్థానిక రాజకీయాలు కూడా అందుకు కారణం. లోకల్ లీడర్లంతా ఎదురుతిరగడంతో ఆమెకు తీవ్రంగా ఎదురుగాలి ఉంది. అయితే ఈ విషయంలో రోజాను ఇంకా కన్విన్స్ చేయలేదు. వైసీపీలో మరో పాపులర్ మంత్రి విడదల రజని. అనూహ్యంగా పార్టీ టికెట్ దక్కించుకుని తొలివిడతే మంత్రి కూడా అయిపోయిన ఆమె సొంత నియోజకవర్గంలో మాత్రం సమన్వయం చేసుకోలేకపోయారు. స్థానిక నాయకులు ఎవ్వరూ ఆమెను యాక్సెప్ట్ చేయడం లేదు. దీంతో గుంటూరుకు తీసు కొచ్చినప్పటికీ అది కూడా తాత్కాలికమే అన్నమాట పార్టీ క్యాంపులో వినిపిస్తోంది. చెల్లుబోయిన శ్రీనివాస్ కు ఈసారి సుభాష్ చంద్రబోస్ నుంచి గట్టి పోటీ వస్తోంది. ఎట్టి పరిస్థితుల్లో తనకే టికెట్ కావాలని ఆయన డిమాండ్ చేస్తున్నారు. దీంతో రాజమండ్రి ఎంపీగా చెల్లుబోయిన ను పంపాలని అనుకుంటున్నారు. ఉషశ్రీ చరణ్ తో పార్టీకి చాలా సమస్యలు వచ్చాయి. లోకల్ లీడర్లతో సయోధ్య కుదరకపోవడంతోపాటు.. భూ ఆక్రమణ ఆరోపణలు పార్టీని ఇబ్బంది పెట్టాయి. కాబట్టి ఆమెకు వీడ్కోలు చెబుతున్నారు. గుమ్మనూరు జయరాం పై వచ్చినన్ని ఆరోపణలు ఏ మంత్రిపైనా రాలేదు. చాలా తీవ్ర ఇబ్బందులున్నప్పటికీ ఆయన్ను మంత్రిగా పూర్తి కాలం కొనసాగించారు. మంత్రులను మార్చినప్పుడు కూడా జయరాం ను తప్పించలేదంటే కారణం వాల్మీకి వర్గం నుంచి మరో వ్యక్తి లేకపోవడమే. ఇప్పుడు తలారీ రంగయ్యను అసెంబ్లీకి తెచ్చి జయరాంను తప్పించేస్తున్నారు. డిప్యూటీ సీఎం నారాయణ స్వామిపై వ్యతిరేకత , సానుకూలత రెండూ లేవు. ఇప్పటి స్పీడ్ రాజకీయాలకు ఆయన పనికిరాడని పక్కన పెడుతున్నారు. పెడన నుంచి ఉన్న జోగి రమేష్ ది సొంత నియోజకవర్గం కాదు. ఆయనపై వ్యతిరేకత ఉన్నప్పటికీ వైసీపీ గాలిలో గెలుచుకొచ్చారు. ఇప్పుడు అక్కడ గెలిచే అవకాశం లేకపోవడంతో ఏలూరు ఎంపీగా వెళ్లమని చెబుతున్నారు. చాలా కాలం మంత్రిగా ఉన్న పినిపె విశ్వరూప్ పై కూడా వ్యతిరేకత ఉంది. కొనసీమ అల్లర్ల సమయంలో అది మరింత పెరిగింది. ఆయనకు ఉన్న ఆరోగ్య సమస్యల కారణంగా కూడా పక్కన పెట్టి.. ఆయన కుమారుడికి మరోచోట టికెట్ ఇవ్వాలనుకుంటున్నారు. వీళ్ల కాకుండా సీనియర్ మంత్రులు ధర్మాన, బొత్స, పెద్దిరెడ్డి, బుగ్గన వంటి వారి సీట్లపై ఏ ప్రభావం లేనప్పటికీ.. పార్టీ వ్యూహాత్మకంగా కొంతమందిని ఎంపీగా పోటీ చేయాలని చెబుతోంది. ధర్మాన, బొత్సతో ఇవే మంతనాలు నడుస్తున్నాయి. అందుకేనేమో బొత్స సత్యనారాణ వేసీపీలో ఏదీ శాశ్వతం కాదన్నారు. అభ్యర్థుల మార్పుపై ఎప్పటి నుంచో కసరత్తు జరుగుతున్నప్పటికీ.. తెలంగాణ ఎన్నికల ఫలితాలు దీనిని మరింత ముందుకు నెట్టాయి తెలంగాణలో ఎమ్మెల్యేలపై వ్యతిరేకత వల్లనే ఎక్కువ స్థానాల్లో ఓడిపోయామని బీఆర్ఎస్ విశ్లేషిస్తోంది. ఆ పార్టీ ఆ విషయాన్ని ముందే గుర్తించినప్పటికీ.. అభ్యర్థులను ఎక్కువ సంఖ్యలో మారిస్తే.. తమపై వ్యతిరేకత ఉందన్న విషయాన్ని ముందే ఒప్పుకున్నట్లు అవుతుందని.. లేకపోతే.. వాళ్లు వేరే పార్టీలోకి వెళితే ఇబ్బంది ఎదురవుతుందని కేసీఆర్ మొండిగా ముందుకెళ్లారు. కేసీఆర్‌ది ఓ రకమైన మొండితనమైతే జగన్ ది మరోరకం. ఆల్రెడీ 175 అని టార్గెట్ ఫిక్స్ చేసిన జగన్ ఈ విషయంలో వెనక్కు తగ్గేలా లేరు. ఏది ఏమైనా సరే ఏ లాంటి ఫలితం వచ్చినా సరే ముందుకే అన్నట్లుగా ఉన్నారు. సామాజిక వర్గాల వారీగా లెక్కలు, కూర్పులు చేర్పులతో జగన్ ఎప్పుడూ పకడ్బందీగానే వెళతారు. ఆయన కాన్ఫిడెన్సు పోయిన సారి మంచి రిజల్ట్ ఇచ్చింది. ఈ మార్పు మరి రిజల్టును పాజిటివ్ చేస్తుందా..

## రాజధాని తరలింపు లేదు.. కోర్టుకు చెప్పిన సర్కార్



విశాఖపట్టణం, డిసెంబర్ 13, :విశాఖను ఏపీ ప్రభుత్వం పాలన రాజధానిగా ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే విశాఖ నుంచి సీఎం జగన్ పాలన చేయాలని నిర్ణయించారు. ఈ మేరకు విశాఖలో సీఎం క్యాంపు కార్యాలయాన్ని ఏర్పాటు చేస్తున్నారు. అంతేకాకుండా ప్రభుత్వ కార్యాలయాలను అమరావతి నుంచి విశాఖకు తరలించేందుకు అడుగులు వేస్తున్నారు. ఇప్పటికే విశాఖలో పలు కార్యాలయాలను సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది. అమరావతి ప్రాంతానికి చెందిన కొందరు పిటిషనర్లు హైకోర్టును ఆశ్రయించారు. సీఎం క్యాంపు కార్యాలయం ముసుగులో విశాఖకు రాజధానిని తరలిస్తున్నారని పిటిషన్ దాఖలు చేశారు. రోస్టర్ ప్రకారం ఈ పిటిషన్ సోమవారం హైకోర్టు బెంచ్ ముందుకు వెళ్లింది. దీంతో హైకోర్టు న్యాయమూర్తి కీలక ఆదేశాలు జారీ చేశారు. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన తర్వాతే రాజధాని తరలింపుపై పూర్తి స్థాయి ఆదేశాలు వెల్లడిస్తామని ప్రభుత్వ న్యాయవాదికి న్యాయమూర్తి తెలిపారు. అయితే ప్రభుత్వ అడ్వకేట్ జనరల్ ఇందుకు అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో మధ్యంతర పిటిషన్ వేసుకోవచ్చని సూచించారు. రాజధాని వ్యవహారాలను విచారించే త్రిసభ్య ధర్మాసనం లేదా పాలనాపరంగా ఏం చేయాలనే అంశంపై ప్రభుత్వమే ఆలోచించుకోవాలని పేర్కొంది. ఒక వేళ త్రిసభ్య ధర్మాసనం ఎలాంటి ఆదేశాలు ఇవ్వకపోతే తామే విచారిస్తామని హైకోర్టు న్యాయమూర్తి తెలిపారు. దీనికి ప్రభుత్వ ప్రభుత్వ న్యాయవాది ఓకే తెలిపారు. త్రిసభ్య ధర్మాసనం తీర్పు వచ్చేలోపే కార్యాలయాలు తరలిస్తే పరిస్థితేంటని, అలా జరగకుండా మధ్యంతర ఆదేశాలు ఇవ్వాలని హైకోర్టు దృష్టికి పిటిషనర్ల తరపు న్యాయవాది ఉన్నం మురళీధర్ తీసుకెళ్లారు. అయితే ఇందుకు ప్రభుత్వ న్యాయవాది బదులిస్తూ.. ఇప్పటికిప్పుడు కార్యాలయాల తరలింపు ఉండదని, అది సుదీర్ఘ ప్రక్రియ అని స్పష్టం చేశారు. ప్రభుత్వం ఇలానే చెప్పి కార్యాలయాల తరలింపునకు అంతర్గంగా ఏర్పాట్లు చేస్తోందని మురళీధర్ కోర్టుకు తెలిపారు. దీంతో రాజధాని, కార్యాలయాలు తరలించకుండా ప్రభుత్వం నుంచి ఆదేశాలు తీసుకోవాలని ప్రభుత్వ న్యాయవాదిని హైకోర్టు న్యాయమూర్తి ఆదేశించారు. అలాగే కేసు విచారణను రేపటికి వాయిదా వేశారు.

# బాలినేని... డోర్స్ క్లోజ్..!



ఒంగోలు, డిసెంబర్ 13, :వచ్చే ఎన్నికల్లో బాలినేని శ్రీనివాసులరెడ్డికి వైసీపీ టికెట్ ఇస్తుందా ఇవ్వదా..? ఇటీవల జరిగిన వరుస పరిణామాల నేపథ్యంలో ఆయనకు ఈసారి టికెట్ దక్కక పోవచ్చనే విషయం తేలిపోయింది. ఆ పార్టీలోని నేతలే ఈ ప్రచారం మొదలు పెట్టారు. మంత్రి పదవి పోయిన తర్వాత బాలినేని వ్యాఖ్యలు, ఆయన్ను సీఎంఓ కార్యాలయానికి పిలిపించి బుజ్జగించడం, ఆ తర్వాత మళ్లీ కొన్నిరోజులకు బాలినేని నోరు జారడం.. ఇవన్నీ మామూలుగా మారిపోయాయి. కానీ ఈసారి పరిస్థితిలో మార్పు వచ్చింది. బాలినేని తాజాగా నోరుజారారు. మంత్రిగా ఉన్నప్పుడు తాను కలెక్షన్లు చేపట్టేవాడినని తనే ఒప్పుకున్నారు. తెలంగాణ ఎన్నికలపై బెట్టింగ్ కాశానని కూడా చెప్పారు. జగన్ గెలవాలని తమకు ఉందని, కానీ తమపై అలాంటి ప్రేమ జగన్ కు ఉందో లేదో తెలియదన్నారు. దీంతో మరోసారి ఆయనకు సీఎంఓ కార్యాలయం నుంచి పిలుపొచ్చింది. కానీ ఈసారి అక్కడికి పిలిపించుకోలేదు, ఫోన్‌లోనే కాస్త గట్టిగా క్లాస్ పీకారని తెలుస్తోంది. దీంతో ఆదివారం ప్రెస్ మీట్ పెట్టిన బాలినేని.. ప్రతిపక్షాలపై విరుచుకుపడ్డారు. మరోసారి జగనే సీఎం అవుతారని చెప్పారు. గతంలో బాలినేని వివాదాస్పద వ్యాఖ్యలు చేసినప్పుడల్లా ఆయన్ను తాడేపల్లికి పిలిపించేవారు. కానీ ఈసారి ఫోన్ వచ్చింది కానీ, పిలుపు రాలేదు. అంటే బాలినేనికి అంత సీన్ ఇవ్వాల్సిన అవసరం లేదని అధిష్టానం ఫిక్స్ అయింది. అదే సమయంలో ఆ ఫ్రస్టేషన్ అంతా తర్వాతి రోజు ప్రెస్ మీట్ లో చూపించారు బాలినేని. ప్రతిపక్షాలపై విరుచుకుపడ్డారు. గతంలో ఎప్పుడూ ఇంత ఘాటుగా ఆయన స్పందించలేదు. ఇప్పుడు అవసరం లేకపోయినా స్పందించేసరికి ఆయనకు ఏ స్థాయిలో డోస్ పడిందో అర్థమవుతోంది. బాలినేని ఎప్పుడూ పెద్దగా వార్తల్లోకెక్కేవారు కాదు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆయన వ్యవహారంలో మార్పు వచ్చిందని అంటున్నారు. రెండోసారి ఆయనకు మంత్రి పదవి దక్కకపోవడంతో బాలినేని అలిగారు. ఆయన అలకకు అదే ప్రధాన కారణం. ప్రకాశం జిల్లానుంచి ఆదిమూలపు సురేష్ కి రెండోసారి అవకాశం ఇవ్వడంతో ఆయన మరింత ఇదైపోయారు. అప్పటినుంచి ఆయన అలగడం, అధిష్టానం బుజ్జగించడం సహజమైపోయింది. ఆ తర్వాత తరచూ ఆయన వార్తల్లోకెక్కుతున్నారు. వైవీ సుబ్బారెడ్డికి సీఎం జగన్ ప్రాధాన్యత ఇవ్వడం కూడా బాలినేనికి ఇష్టం లేదు. ఆయన ఒంగోలులో తన వ్యతిరేక వర్గాన్ని చేరదీస్తున్నారనేది బాలినేని ప్రధాన ఆరోపణ. కానీ జగన్ వైవీకి ప్రాధాన్యత తగ్గించలేదు. టీటీడీ చైర్మన్ గా తప్పుకున్నాక వైవీకి ఉత్తరాంధ్ర బాధ్యతలు అప్పగించారు. దీంతో బాలినేని మరింత నొచ్చుకున్నారు. ఇటీవల ప్రకాశం జిల్లాలో కబ్జాలు, అక్రమ రిజిస్ట్రేషన్ల వ్యవహారంలో బాలినేని అనుచరులు టార్గెట్ అయ్యారు. అధికార పార్టీలో ఉండి కూడా తన అనుచరులను రక్షించుకోలేకపోయానని ఆయన బాధపడ్డారు. అక్కడినుంచి మరో ఎపిసోడ్ మొదలైంది. పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటూనే తన కొడుకు రాజకీయ భవిష్యత్ కోసం బాలినేని ప్రణాళికలు రచించారు. కానీ పార్టీలో కింది స్థాయి నాయకత్వం ఆయనకు సహకరించడంలేదు. పైగా జిల్లా మొత్తం బాలినేని పెత్తనం కోరుకుంటున్నారు. గతంలో ఇన్‌చార్జ్ పదవి ఇచ్చినా వద్దని, ఇప్పుడు జిల్లా కావాలంటే ఎలా అని అధిష్టానం ప్రశ్నిస్తోంది. ఈ దశలో బెట్టింగ్ వ్యాఖ్యలు మరింత కలకలం రేపాయి. దీంతో బాలినేని మరోసారి వివరణ ఇచ్చుకోవాల్సి వచ్చింది. ఆయన వివరణ ఇచ్చుకున్నా కూడా అధిష్టానం మాత్రం కాస్త కఠినంగానే ఉండే అవకాశముంది. వచ్చే ఎన్నికల్లో బాలినేని కుటుంబానికి వైసీపీ నుంచి టికెట్ దక్కే అవకాశాలు లేవని ఆ పార్టీ నేతలే గుసగుసలాడుకుంటున్నారు.

# ఆనంకు ఏమైంది...



నెల్లూరు, డిసెంబర్ 13, : ఒకప్పుడు నెల్లూరు రాజకీయాలను శాసించింది ఆనం కుటుంబం. జిల్లాలో కనీసం రెండు స్థానాలకు ఆనం కుటుంబం ప్రాతినిధ్యం వహిస్తుండేది. నెల్లూరు సిటీ పరిధిలో కార్పొరేటర్లు, ఇతర నామినేటెడ్ పోస్టుల్లో.. వారు సూచించినవారికే అవకాశాలు దక్కేవి. ఇతర జిల్లా పోస్టుల్లో కూడా వారి శిష్యగణమే ఉండేది. ఇదంతా గతం. ఇప్పుడు ఆనం పెత్తనం జిల్లా రాజకీయాల్లో కనుమరుగైపోతోంది. రామనారాయణ రెడ్డి ప్రస్తుతం వెంకటగిరి ఎమ్మెల్యేగా ఉన్నా కూడా ఆయన పార్టీ మారడంతో అక్కడ ఆయన మాట చెల్లుబాటు కావడంలేదు. ప్రస్తుతం నెల్లూరు సిటీలోని తన ఇంటిలో విశ్రాంతి తీసుకుంటున్నారు రామనారాయణ రెడ్డి. అధికార పార్టీ వైసీపీకి అనూహ్యంగా దూరమైన ఆనం రామనారాయణ రెడ్డి టీడీపీకి దగ్గరయ్యారు. టీడీపీ అధినేత, మాజీ సీఎం చంద్రబాబుని కలిశారు, నెల్లూరు జిల్లాలో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యువగళం యాత్ర సందర్భంగా హడావిడి చేశారు. కానీ ఆ తర్వాత అంతా సైలెన్స్. ఇంతకీ ఆనం ఈసారి ఎక్కడ పోటీ చేస్తారు, ఏ నియోజకవర్గానికి వెళ్తారు, అసలు పోటీ చేస్తారా, వారసులకు అవకాశం ఇస్తారా.. అనేది తేలడంలేదు. ప్రస్తుతం ఆనం రామనారాయణ రెడ్డి వెంకటగిరి ఎమ్మెల్యేగా ఉన్నారు. అది ఆయనకు కొత్త నియోజకవర్గం. తొలిసారి 2019లో పోటీ చేసి గెలుపొందారు. వాస్తవానికి అక్కడికి వెళ్లడం ఆయనకు పూర్తిగా ఇష్టంలేదు. కానీ వైసీపీలో ఆ స్థానం మాత్రమే ఖాళీగా ఉండటంతో అక్కడకు వెళ్లి గెలిచారు రామనారాయణ రెడ్డి. ఆ తర్వాత కొన్నాళ్లు అక్కడే ఉన్నా.. మంత్రి పదవి దక్కకపోవడం, తనకు ఆశించిన ప్రయారిటీ ఇవ్వకపోవడంతో ఆయన జగన్ కు దూరం జరిగారు. స్వపక్షంలోనే ఉండి, విపక్షంలా మాట్లాడటం మొదలు పెట్టారు. దీంతో ఆయనపై వేటు పడింది. వెంకటగిరిలో ఆయన్ను కాదని, నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డికి పార్టీ పెత్తనం ఇచ్చారు. దీంతో ఆనం వెంకటగిరిని ఖాళీ చేసి నెల్లూరుకు వచ్చారు. అనువైన నియోజకవర్గం కోసం ఎదురు చూస్తున్నారు. వాస్తవానికి ఆనం టీడీపీలో చేరి నెల్లూరు సిటీ లేదా, రూరల్ నుంచి పోటీ చేయాలనుకున్నారు. కానీ అనూహ్యంగా నెల్లూరు రూరల్ నుంచి కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి కూడా టీడీపీలో చేరడంతో ఆ స్థానం ఆనంకు దొరకలేదు. ఇక నెల్లూరు సిటీనుంచి ఎలాగూ పొంగూరు నారాయణ ఉన్నారు. అందుకే తన పాత నియోజకవర్గం ఆత్మకూరుకు వెళ్లాలనుకున్నారు ఆనం. అయితే ఇప్పుడు అక్కడ కూడా చిక్కొచ్చిపడినట్టుంది. ఆయన కొన్నాళ్లుగా ఆత్మకూరు వైపే చూడటంలేదు. నారా లోకేష్ పాదయాత్ర ఆత్మకూరు నియోజవర్గంలో ఉన్నప్పుడు ఆనం మార్కు హడావిడి చేశారు. కానీ ఇప్పుడు పూర్తిగా నియోజకవర్గానికి దూరమయ్యారు. ఇక్కడ ఆనం పోటీ చేస్తాడనే వార్తలు వినిపించడంతో టీడీపీలో మిగతా నేతలు ఆ సీటుపై ఆశలు వదిలేసుకున్నారు. కానీ ఆనం కూడా అక్కడికి రాకపోవడం, కనీసం స్థానికంగా సమావేశాలు ఏర్పాటు చేయకపోవడంతో ఆ సీటుపై అనేక అనుమానాలు మొదలయ్యాయి. అసలింతకీ ఆనం ఇల్లు దాటి ఎందుకు బయటకు రావడంలేదు, సడన్ గా ఆయన రాజకీయ కార్యకలాపాలు ఎందుకు ఆపేశారు అనేది తేలాల్సి ఉంది.

## డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేసిన ఎంపీపీ సుంకర శ్రీవల్లి వీరబాబు



గోకవరం ప్రజా పాలన డిసెంబర్ 13: గోకవరం మండలంలో జరిగే పలు అభివృద్ధి కార్యక్రమాలకు వైకాపా ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఎంపీపీ సుంకర శ్రీవల్లి వీరబాబు అన్నారు. మండలంలోని గోకవరం శివారు వీర్లంక పల్లి గ్రామంలో మండల పరిషత్, పంచాయతీ రాజ్ కు చెందిన 15 లక్షల రూపాయలు నిధులతో నిర్మాణం చేస్తున్న డ్రైనేజీ పనులకు బుధవారం ఎంపీపీ సుంకర శ్రీవల్లి వీరబాబు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ మండలంలోని ఇప్పటివరకు సుమారు రెండు కోట్ల రూపాయల మండల పరిషత్ నిధులను ఖర్చు పెట్టడం జరిగిందన్నారు. భవిష్యత్తులో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామన్నారు ఈ కార్యక్రమంలో జడ్పిటిసి దాసరి శ్రీరంగ రమేష్, వైకాపా మండల కన్వీనర్ పాటి రాంబాబు, రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి వరసాల ప్రసాద్, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు కర్రి సురారెడ్డి, ఉప సర్పంచ్ అల్లాడి రాంబాబు, దొడ్డా విజయ్, మాజీ సర్పంచి కర్రి శివరామకృష్ణ తోట్టా సత్యనారాయణ, బడితబోయిన చిన్ని, నందూరి బుజ్జి, పంచాయతీ కార్యదర్శి టి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడీ టీచర్లను ఇబ్బంది పెడుతున్న ప్రభుత్వం: మాజీ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య

నందిగామ డిసెంబర్ 13 ప్రజాపాలన ప్రతినిధి రాష్ట్ర వ్యాప్తంగా అంగన్వాడీ టీచర్లను ఆయాలను పలు ఇబ్బందులకు గురి చేస్తుందని రాష్ట్రవ్యాప్తంగా అంగ న్వాడీలు మెరుపు సమ్మెను ప్రకటించారు ఈ దీనిలో భాగంగా నందిగామ నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న అంగన్వాడీ సిబ్బంది స్థానిక తాసిల్దార్ కార్యాలయం ఎదురుగా రిలే నిరాహార దీక్షలు చేపట్టారు ఈ కార్య క్రమానికి మాజీ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య హాజరై వారికి తన సంఘీభావాన్ని ప్రకటించారు ఈ సందర్భం గా ఆమె మాట్లాడుతూనా అక్కనా చెల్లి అంటూ వారి కి తోడుగా ఉంటాను అంటూ తన బూటకపు మోస పు మాటలతో జగన్ రెడ్డి అంగన్వాడి మహిళలను నమ్మించి మోసం చేశాడన్నారుతెలంగాణ రాష్ట్ర ప్ర భుత్వ జీతాలు కన్నా నా అక్క చెల్లెళ్లకు రెట్టింపు జీ తాలు చెల్లిస్తానని జగన్మోహన్ రెడ్డి చెప్పిన మాటలు నిజం కాదా?అన్నారుఅంగన్వాడి మహిళల శ్రమను దోపిడీ చేస్తున్నారు.

రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీ సి బ్బందికి జీతాలు పెంచి వారి నాదుకోవాలని ఆమె డి మాండ్ చేశారుఅంగన్వాడీ వర్కర్లు మరియు హెల్ప ర్లు చేస్తున్న సమ్మె పూర్తిగా న్యాయబద్ధమైనది దీనిని తెలుగుదేశం పార్టీ అధిష్టానం దృష్టికి తీసుకువెళ్లి తె లుగు దేశ ప్రభుత్వం రాగానే వారికి తగిన న్యాయం చేస్తామని వారికి పూర్తిగా అండగా ఉంటామన్నారు

# సినిమా న్యూస్

## వెంకీ మామ కి ఎన్టీఆర్ బర్త్ డే విషెస్!



విక్టరీ వెంకటేష్ ప్రధాన పాత్రలో నటించిన లేటెస్ట్ యాక్షన్ ఎంటర్టైనర్ సైంధవ్ సంక్రాంతి పండుగ సందర్భంగా జనవరి 13 న వరల్డ్ వైడ్ గా థియేటర్ల లో గ్రాండ్ రిలీజ్ అయ్యేందుకు రెడీ అయిపోయింది. ఈ స్టార్ హీరో పుట్టిన రోజు నేడు. వెంకీ మామ పుట్టిన రోజు శుభాకాంక్షలు ఫ్యాన్స్, సినీ ప్రముఖులు స్పెషల్ బర్త్ డే విషెస్ తెలుపుతున్నారు.గ్లోబల్ స్టార్ ఎన్టీఆర్, వెంకీ మామ పుట్టిన రోజు సందర్భంగా సోషల్ మీడియా వేదిక గా విషెస్ తెలిపారు. మీ విలక్షణ నటనతో మమ్మల్ని అలరిస్తూనే ఉండాలని, ఆరోగ్యం మరియు శ్రేయస్సు తో ఆశీర్వదించబడాలి అంటూ బర్త్ డే విషెస్ తెలిపారు. ఈ పోస్ట్ వైరల్ గా మారుతోంది. యంగ్ టైగర్ ఎన్టీఆర్ ప్రస్తుతం దేవర చిత్రం షూటింగ్ లో బిజీగా ఉన్నారు. కొరటాల శివ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ భారీ యాక్షన్ ఎంటర్టైనర్ పై ప్రేక్షకుల్లో, అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి

## ‘బ్రహ్మాస్త్ర 2’పై ‘యానిమల్’ ఎఫెక్ట్




రణబీర్ కపూర్ నటించిన బ్రహ్మాస్త్ర బ్లాక్ బస్టర్ విజయం సాధించినట్టు ప్రచారమైంది. కానీ ఇది యావరేజ్ హిట్. ఈ సినిమా తర్వాత వెంటనే తూ జీతూ.. సినిమాతో రణబీర్ మరో హిట్టందుకున్నాడు. ఇప్పుడు యానిమల్ తో కెరీర్ బెస్ట్ హిట్ అందుకున్నాడు. కానీ ఇంకా బ్రహ్మాస్త్ర సీక్వెల్ గురించి మాట లేదు. నిర్మాత కరణ్ జోహార్ దీనిపై ఇంతవరకూ పెదవి విప్పలేదు. నిజానికి బ్రహ్మాస్త్ర విడుదల సమయంలో దీనిపై బోలెడంత హంగామా నడిచింది. అయితే దీనిపై కరణ్ ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని తెలిసింది. అంతేకాదు బ్రహ్మాస్త్ర 2 భారీ మల్టీస్టారర్ గా చిత్రీకరించాల్సి ఉంటుంది. కథ డిమాండ్ మేరకు రణబీర్ తో పాటు ఇందులో రెండో పెద్ద హీరో నటించాల్సి ఉంటుంది. కానీ అలా రెండో హీరో కూడా యాడయితే బడ్జెట్ అదుపు తప్పుతుందని ఆలోచిస్తున్నారట. రెండో హీరోగా రణవీర్ ని తీసుకునే ఆలోచన ఉందని కూడా కథనాలొచ్చాయి. బహ్మాస్త్ర 2 ఆలస్యమవ్వడానికి యానిమల్ ఎఫెక్ట్ కూడా ఉందని అంటున్నారు. రణబీర్ ఇప్పుడు 1000 కోట్ల క్లబ్ ని అందుకున్నాడు. దానికి తగ్గట్టు భారీ పారితోషికం పెంచేసాడు. సుమారు 60 కోట్ల వేర డిమాండ్ చేస్తున్నాడనేది టాక్. ఒకవేళ ఇదే నిజమైతే, రణబీర్ తో పాటు నటించే పెద్ద హీరో కూడా 60కోట్లు డిమాండ్ చేసే వీలుంటుంది. దీంతో బడ్జెట్ మరింత పెద్దదవుతుంది. ఇక బ్రహ్మాస్త్ర త్రయం అంతా భారీ వీఎఫ్ఎక్స్ మీద ఆధారపడి ఉంది కాబట్టి 500 కోట్ల లోపు బడ్జెట్ సరిపోదు. ఇది ఆర్.ఆర్.ఆర్ కంటే ఎక్కువ బడ్జెట్ ని కోరుతుంది. అంటే బహ్మాస్త్ర 2 ని ఇద్దరు పెద్ద స్టార్లతో నిర్మిస్తే బడ్జెట్ సుమారు 600 కోట్లు పైగా అవుతుంది. అంత పెద్ద బడ్జెట్ పెడితే ఆర్.ఆర్.ఆర్ లేదా పఠాన్ తరహాలో 1000 కోట్లు అంతకుమించి వసూలు చేస్తేనే వర్కవుటవుతుంది. అలా కాకుండా ఫెయిలైతే నిర్మాత నిండా మునిగిపోతాడు. అందుకే కరణ్ ఇప్పుడు ఆచితూచి అడుగులు వేస్తున్నాడు. బ్రహ్మాస్త్ర 2 చిత్రం 2026లోపు సెట్స్ కెళ్లే అవకాశం లేదని కూడా ప్రముఖ బాలీవుడ్ మీడియా కథనం వెలువరించింది. అయితే ఇది అధికారిక సమాచారం కదు. ప్రస్తుతానికి ఊహాగానాలు మాత్రమే.

## పవన్ “ఓజి” రిలీజ్ అప్పటికి.?



పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ హీరోగా ఇప్పుడు చేసున్న మూడు చిత్రాలు కోసం అందరికీ తెలిసిందే. దేనికదే మంచి అంచనాలు నెలకొల్పుకున్నా ఈ చిత్రాల్లో వీరమల్లు తర్వాత అనౌన్స్ చేసి స్టార్ట్ చేసిన చిత్రాలు కూడా ఉన్నాయి. మరి ఆ చిత్రాలు “ఓజి” మరియు “ఉస్తాద్ భగత్ సింగ్” లు కాగా ఈ చిత్రాలను తన ఫ్యాన్స్ సుజీత్ మరియు హరీష్ శంకర్ లు తెరకెక్కిస్తున్నారు.అయితే వీటిలో కాస్త ఎక్కువ షూటింగ్ కంప్లీట్ అయ్యిన చిత్రం దర్శకుడు సుజీత్ తెరకెక్కిస్తున్న “ఓజి”. మరి ఈ సినిమా రిలీజ్ పై లేటెస్ట్ బజ్ వినిపిస్తుంది. ఈ సినిమా రిలీజ్ అయితే వచ్చే ఏడాది దసరా బరిలో ఉండొచ్చని ఇప్పుడు రూమర్స్ వినిపిస్తున్నాయి. పవన్ ఎలాగో ఎన్నికల తర్వాత ఫ్రీ కానున్నాడు దీంతో మళ్ళీ షూట్ రీస్టార్ట్ చేస్తే అప్పటికి మేకర్స్ ఆ సినిమాని సిద్ధం చేసే ఛాన్స్ ఉన్నట్టుగా ఇపుడు తెలుస్తోంది.

## యానిమల్ ఆల్బమ్ బిల్ బోర్డ్ జాబితాలో సంచలనంగా మారింది




రణబీర్ కపూర్– రష్మిక మందన జంటగా సందీప్ వంగా తెరకెక్కించిన ‘యానిమల్’ స ంచలన విజయం సాధించిన సంగతి తెలిసిందే. టీసిరీస్ తో కలిసి సందీప్ వంగా ఈ చిత్రాన్ని నిర్మించారు. సందీప్ వంగా స్వయంగా ఈ చిత్రానికి దర్శకత్వం వహించారు. త్వరలోనే 1000 కోట్ల గ్రాస్ క్లబ్ లో చేరనుంది ఈ చిత్రం. ఇప్పుడు టీసిరీస్ యానిమల్ ఆల్బమ్ కూడా బిల్ బోర్డ్ జాబితాలో సంచలనంగా మారింది. తాజాగా యానిమల్ నుంచి మూడు పాటలు బిల్ బోర్డ్ టాప్ 5 చార్ట్ లో చేరాయి. నేటితరాన్ని ఓ ఊపు ఊపిన యానిమల్ సాంగ్ అర్జన్ వెయిలీ ప్రతిష్ఠాత్మక బిల్ బోర్డ్ లిస్ట్ లో టాప్ -1 పాటగా నిలిచింది. ఇదే చిత్రం నుంచి టాప్ 3 పాటగా బి పార్క్ ఆలపించిన సారీ దునియా జాలా దేంగే.. సత్రంగ.. గీతం టాప్ 5 పాటగా జాబితాలో నిలిచాయి. షారూఖ్ -జవాన్ నుంచి అర్జిత్ సింగ్ ఆలపించిన చలియే..పాట టాప్ 2 పాటగా ని లవగా, టాప్ 4 పాటగా హరిహరన్ ఆలపించిన హనుమాన్ చాలీసా నిలిచింది.ఇది సిక్కు గురువుల వీరత్వానికి సంబంధించిన ఒక చారిత్రక గీతం స్ఫూర్తితో రూపొందిన పాట. ఈ పాటను హింసాత్మక సన్నివేశంలో ఉపయోగించడంపై సిక్కుల్లో ఒక వర్గం అభ్యంతరం వ్యక్తం చేస్తోంది. దీనిని పలువురు అలాంటి సందర్భంలో ఉపయోగించడం అభ్యంతరకరం అని చెబుతున్నారు. అయితే అర్జన్ వైలీ పాటలోని రౌద్రరసం యువతరానికి పిచ్చిగా నచ్చేసింది. ఇది సినిమా రిలీజ్ కి ముందే గూగుల్ లో మిలియన్ల వ్యూస్ తో ట్రెండింగ్ అయ్యింది. ఇప్పుడు బిల్ బోర్డ్ నంబర్ 1 గీతంగా చరిత్రకెక్కింది. అర్జన్ వైలీ పాటను బూపేందర్ బబ్బల్ ఆలపించారు.

## రణబీర్ రామాయణం.. బ్లాస్ట్ అయ్యే అప్‌డేట్



సంచలన విజయాన్ని ఆస్వాధిస్తున్నాడు. ఇంతలోనే తదుపరి ప్రాజెక్ట్ – నితేష్ తివారీతో రామాయణం గురించి ఆసక్తికర అప్ డేట్ అందింది. త్వరలో ఈ సినిమాని ప్రారంభించే అవకాశం ఉందనేది దీని సారాంశం. ఇటీవల ఒక సోషల్ మీడియా యూజర్ ప్రశ్నకు సమాధానంగా రణబీర్ రామాయణం ప్రారంభోత్సవం గురించి ప్రస్థావించాడు. 2024 వేసవిలో రామాయణం సెట్స్ కి వెళ్లడానికి సిద్ధంగా ఉందని రణబీర్ స్వయంగా చెప్పారని సదరు నెటిజన్ పేర్కొన్నారు. తాను విమానాశ్రయంలో రణబీర్ కపూర్‌తో రామాయణం గురించి చర్చించినట్లు అతడు పేర్కొన్నాడు. ఇమ్మిగ్రేషన్ క్యూలో రణబీర్ కపూర్ కంటే ముందు నిలబడిన అతడు చయానిమల్ గురించి.. అతడి తదుపరి క్రేజీ ప్రాజెక్ట్ గురించి మాట్లాడానని తెలిపాడు. నేను బొంబాయి ట్రిప్ వెళుతున్నాను.. అతడు ఎంత అందమైన వ్యక్తి! అంటూ అతడు రణబీర్ ని పొగిడేసాడు. రా మాయణం 2024 మధ్యలో ప్రారంభమవుతుందని రణబీర్ కపూర్ తనతో చెప్పినట్లు ప్రయాణీకుడు వెల్లడించారు. రామాయణం వేసవి ప్రారంభంలో చిత్రీకరణకు వెళుతుందని చెప్పాడు. నేను అంతకు మించి ఏమీ చెప్పకూడదనే విషయం నాకు కచ్చితంగా తెలియదు. కానీ రామాయణం తారాగణం చాలా పిచ్చిగా ఉంది వావ్! బాలీవుడ్ ని 2023 నుండి తదుపరి స్థాయికి తీసుకువెళ్లే ప్రయత్నమిది... అని వరుస పోస్ట్ లలో సదరు నెటిజన్ ఎగ్జయిట్ అవుతూ రాసారు. రామాయణం షూటింగ్ ఈ ఏడాది డిసెంబరులో ప్రారంభం కానుందని గతంలో వార్తలు వచ్చాయి. కానీ తాజా సమాచారంతో ఇప్పుడు కొంత స్పష్టత వచ్చింది. ఇంతకుముందు సీత పాత్ర కోసం అలియా భట్ తో చర్చలు జరుపగా డేట్స్ సంబంధిత సమస్యల కారణంగా వెనక్కి తగ్గింది. ఈ సినిమాలో కెజిఎఫ్ స్టార్ యష్ రావణుడిగా నటించే అవకాశం ఉంది. అతడిపై ఫోటోషూట్ కూడా జరిగింది. ఈ ఏడాది అక్టోబర్‌లో సన్నీడియోల్ హనుమాన్‌గా నటించే అవకాశం ఉందని కూడా కథనాలొచ్చాయి.అయితే దీనికి సంబంధించి ఇప్పటి వరకు ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు.



## భయపెట్టే పిండం.. వాళ్ళు అసలు చూడొద్దట



శ్రీరామ్, కుశీ రవి కీలక పాత్రల్లో నటించిన హారర్ డ్రామా పిండం డిసెంబర్ 15న గ్రాండ్ రిలీజ్‌కు సిద్ధమవుతోంది. సాయికిరణ్ దైద దర్శకుడిగా పరిచయమవుతున్న ఈ సినిమాను కళాహి మీడియా పతాకంపై యశ్వంత్ దగ్గుమాటి నిర్మించారు. ఫస్ట్ లుక్ తోనే హారర్ ఆడియెన్స్ ను బాగా ఎట్రాక్ట్ చేసిన ఈ సినిమా ఆ తరువాత కూడా వరుస అప్డేట్స్ తో సినిమాకి మంచి హైప్ క్రియేట్ చేస్తోంది. ఇక ఈ చిత్రం ఈ వారం సెన్సార్ ఫార్మాలిటీలను పూర్తి చేసుకుంది. సెన్సార్ బోర్డ్ నుంచి పిండం సినిమాకు సర్టిఫికెట్‌ని మంజూరు చేశారు. దీంతో సినిమా సోషల్ మీడియాలో మరింత హాట్ టాపిక్ గా మారింది.ఇప్పటికే సెన్సార్ నుంచి కొన్ని కటింగ్స్ కూడా జరిగినట్లు తెలుస్తోంది. ఇక ఇందులో భయపెట్టే సన్నివేశాలు అలాగే మరికొన్ని ఊహించని సెన్సిటివ్ సీన్స్ బలంగా ఉండబోతున్నాయట. ఇక గర్భిణీ స్త్రీలకు ఈ సినిమా చూడడం అసలు మంచిది కాదని పేర్కొంటూ బృందం కఠినమైన విషయాన్ని తెలిపింది. సాధారణంగా ఎలాంటి సినిమా అయినా సరే సినిమా యూనిట్ వాళ్ళు ఇలాంటి విషయాలు పెద్దగా హైలెట్ చేయరు. కానీ పిండం మేకర్స్ మాత్రం జాగ్రత్తలు చెప్పడం హాట్ టాపిక్ గా మారింది.ఈ ప్రకటన సినిమాపై ఆసక్తిని పెంచింది. నల్గొండలో జరిగిన ఒక యదార్థ సంఘటన ఆధారంగా తెరకెక్కిన ఈ చిత్రం ఆత్మలు ఆవహించిన ఇంట్లో చిక్కుకున్న మధ్యతరగతి కుటుంబం చుట్టూ తిరుగుతుంది.శ్రీనివాస్ అవసరాల మరియు ఈశ్వరీ రావు పిండమ్‌లో ఇతర కీలక పాత్రలు పోషించారు. చిత్రీకరణను జెట్ స్పీడ్ లో ఫినిష్ చేయడమే కాకుండా ప్రమోషన్స్ లోను మేకర్స్ జోరు చూపిస్తున్నారు. మునుపెన్నడూ చూడని ఒక సరికొత్త హారర్ మూవీ ఇది అంటూ దర్శకుడు చెబుతున్నారు.

Printed,Published & Owned by: Sajja Dhananjaya Sarath, Printed & published at Unyted Publications, From H.no: #50-61,-3, Rajendra Nagar, Seethampet, Visakhapatnam-16. and SREE SESHASAI ENTERPRISES “D.NO : 3-88, “C/O CHANDRA THEATER,“ GOSALA VILLAGE, “MAIN ROAD, PENAMALURU MANDAL, KRISHNA DT, ANDHRAPRADESH, India. Editor: Sajja Dhananjaya Sarath. RNI:APTEL/2008/25531,Permitted for posting under concession rates of postage, Postal Registration No. VJ/189/2017-19,Email.editor.prajapalana@gmail.com
PIN: 521151.“MOBILE :9912333140 Email : sreeseshasaivja@gmail.com.